మెట్రో సిటీటైమ్స్
శుక్రవారం, ఆగస్టు 7, 2026

# గేమ్ ఛేంజర్ కానున్న సముద్ర మంథన్

ముడిచమురు, సహజవాయువు (గ్యాస్) అవసరాల కోసం విదేశీ దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు భారత్ కీలక అడుగు వేసింది. సముద్రగర్భంలో దాగి ఉన్న చమురు, గ్యాస్ నిల్వలను వెలికితీయడమే లక్ష్యంగా రూ. 84,084 కోట్ల అంచనా వ్యయంతో 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద సముద్రంలోని అత్యంత లోతైన, ప్రమాదకర ప్రాంతాల్లో చమురు, గ్యాస్ అన్వేషణ కోసం తవ్వే బావులకు అయ్యే ఖర్చులో సగం లేదా గరిష్ఠంగా రూ. 650 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నేరుగా బడ్జెట్ ద్వారా భరించనుంది. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో, అంటే 2031 నాటికి, సముద్రగర్భంలో సుమారు 60 లోతైన, అత్యంత లోతైన బావులు తవ్వేందుకు రూ. 43,200 కోట్లు కేటాయించారు. ఒక్కో బావికి గరిష్ఠంగా రూ. 650 కోట్ల వరకు వ్యయం చేయనున్నారు. అలాగే ఆఫ్‌షోర్ ప్రాంతాల్లో సీస్మిక్, జియోలాజికల్ సర్వేలు నిర్వహించి చమురు, గ్యాస్ నిల్వల అవకాశాలను గుర్తించేందుకు రూ. 28,534 కోట్లు వెచ్చించనున్నారు. సముద్రంలో లభించే చమురు, గ్యాస్‌ను తీర ప్రాంతాలకు తరలించేందుకు గ్యాస్ పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ. 10,000 కోట్లు ఖర్చు చేయనున్నారు. అదనంగా ఆఫ్‌షోర్ రంగానికి అవసరమైన యంత్రాలు, సేవలు అందించే పారిశ్రామిక జోన్‌ల అభివృద్ధికి రూ. 2,000 కోట్లు కేటాయించారు. లోతైన సముద్ర ప్రాంతాల్లో చమురు అన్వేషణలో విజయవంతం కాకపోతే భారీ పెట్టుబడులు వృథా అవుతాయనే భయంతో ప్రైవేట్ కంపెనీలు ఇప్పటివరకు ఈ రంగానికి దూరంగా ఉన్నాయి. చమురు నిల్వలు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత మాత్రమే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే తొలిసారిగా ప్రభుత్వం స్వయంగా బడ్జెట్ నిధులతో ఈ అన్వేషణలోని రిస్క్‌ను భరించేందుకు ముందుకొచ్చింది. చిన్న మొత్తాల్లో చమురు నిల్వలు లభించినా వాటిని వాణిజ్యపరంగా వినియోగించుకునేలా ప్రభుత్వ సాయంతో ఉమ్మడి పైప్‌లైన్‌లు, ప్రాసెసింగ్ మౌలిక వసతులు అభివృద్ధి చేయనుంది. దీంతో కంపెనీలపై పడే మౌలిక సదుపాయాల ఖర్చు గణనీయంగా తగ్గనుందగత పదేళ్లలో దేశంలో ముడిచమురు అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటం 77 శాతం నుంచి 88 శాతానికి పెరిగిందిఅలాగే దేశ అవసరాల్లో సగానికి పైగా సహజవాయువు కూడా దిగుమతుల ద్వారానే వస్తోంది. 'సముద్ర మంథన్' పథకం ద్వారా ప్రతి ఏడాది 10 నుంచి 15 మిలియన్ టన్నుల అదనపు చమురు ఉత్పత్తి సాధించి, దిగుమతులను 3 నుంచి 5 శాతం వరకు తగ్గించే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. భారత్‌లో చమురు, గ్యాస్ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం 1997 నుంచి విధానాలను క్రమంగా సరళీకరిస్తోంది. ఇందులో భాగంగా 2016లో హైడ్రోకార్బన్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ లైసెన్సింగ్ పాలసీ , ఓపెన్ ఎకరేజ్ లైసెన్సింగ్ పాలసీ లను ప్రవేశపెట్టింది. అలాగే 2025 ఏప్రిల్‌లో అమల్లోకి వచ్చిన ఆయిల్ ఫీల్డ్స్ సవరణ చట్టం ద్వారా పన్నులు, లీజు విధానాలను మరింత సులభతరం చేసింది. ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు భారత్ తన చమురు అన్వేషణను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీ సుమారు 18 నుంచి 20 బిలియన్ డాలర్ల భారీ వ్యయంతో లోతైన సముద్ర గర్భంలో డ్రిల్లింగ్ చేసేందుకు ప్రపంచవ్యాప్త టెండర్లను ఆహ్వానించింది. ఐదేళ్ల కాల పరిమితితో అత్యాధునిక డ్రిల్‌షిప్‌లు, సెమీ-సబ్ మెర్సిబుల్ రిగ్‌లను అద్దెకు తీసుకోవడమే ఈ టెండర్ ప్రధాన ఉద్దేశం. ఓఎన్‌జీసీ తన అన్వేషణ ప్రణాళికను కేవలం పాత బేసిన్‌లకే పరిమితం చేయకుండా, కొత్త సరిహద్దులను వెతుకుతోంది. ప్రస్తుతం చమురు ఉత్పత్తి అవుతున్న కృష్ణ-గోదావరి బేసిన్‌లో కార్యకలాపాలను ముమ్మరం చేయడంతో పాటు, ఇప్పటివరకు పెద్దగా అన్వేషించని అండమాన్, నికోబార్ దీవుల సమీపంలోని అత్యంత లోతైన జలాలపై దృష్టి సారించింది. ఈ ప్రాజెక్టులోని సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రపంచ చమురు దిగ్గజాలైన ఎక్సాన్‌మొబిల్, బీపీ, టోటల్ ఎనర్జీస్, పెట్రోబ్రాస్‌ల సహకారాన్ని ఓఎన్‌జీసీ కోరుతోంది. ముంబైలో జరిగిన ప్రీ-బిడ్ సమావేశానికి ఇప్పటికే డజనుకు పైగా అంతర్జాతీయ సంస్థలు హాజరవ్వడం ఈ ప్రాజెక్టు ప్రాధాన్యతను చాటిచెబుతోంది. రష్యా చమురుపై పెరిగిన మొగ్గు.. ఒకవైపు స్వదేశీ అన్వేషణ జరుగుతుండగానే, మరోవైపు తక్షణ అవసరాల కోసం భారత్ రష్యా నుంచి భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరియు హార్ముజ్ జలసంధి వద్ద అంతరాయాల కారణంగా ప్రపంచ సరఫరా తగ్గడంతో, భారత రిఫైనరీలు ఏప్రిల్ డెలివరీ కోసం సుమారు 60 మిలియన్ బ్యారెళ్ల రష్యా ముడి చమురును కొనుగోలు చేశాయి. ఇది ఫిబ్రవరి నెల కొనుగోళ్ల కంటే రెట్టింపు కావడం గమనార్హం. అమెరికా ఇచ్చిన తాత్కాలిక మినహాయింపులు కూడా రష్యా నుంచి చమురు సేకరణ పెరగడానికి మార్గం సుగమం చేశాయి. సంస్కరణలకు కొనసాగింపుగానే ఇప్పుడు 'సముద్ర మంథన్ ఆఫ్‌షోర్ ఎక్స్‌ప్లోరేషన్ పథకం'ను తీసుకొచ్చింది. ఈ పథకం ద్వారా భారత చమురు క్షేత్రాల్లోకి అంతర్జాతీయ ఇంధన దిగ్గజాలను ఆకర్షించడంతో పాటు, దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఈఎస్ఐ ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలి

**- ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదన**
**- లోక్‌సభలో నియమం-377 కింద విజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధి అంశాన్ని ప్రస్తావించిన ఎంపీ కేశినేని శివనాథ్**

న్యూఢిల్లీ : విజయవాడ గుణదాలలో ఉన్న ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా ఉన్నతీకరించడంతో పాటు అదే ప్రాంగణంలో ఈఎస్ఐసీ వైద్య కళాశాలఏర్పాటు చేయాలని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు లోక్‌సభలో నియమం-377 కింద ప్రత్యేక అంశంగా ప్రతిపాదించారు ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, 1968లో స్థాపించబడిన విజయవాడ గుణదాల ఈఎస్ఐ ఆసుపత్రి దాదాపు ఆరు దశాబ్దాలుగా పారిశ్రామిక కార్మికులు, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం లబ్ధిదారులు మరియు వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో 110 పడకలు మాత్రమే ఉండగా, మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలకు చెందిన సుమారు 2.88 లక్షల మంది బీమాదారులు, దాదాపు 10 లక్షల మంది ఆధారిత కుటుంబ సభ్యులు ఈ ఆసుపత్రి సేవలపై ఆధారపడుతున్నారని తెలిపారు. లబ్ధిదారుల సంఖ్య పెరిగినా ఆసుపత్రి సామర్థ్యం పెరగలేదుగత కొన్నేళ్లుగా ఈఎస్ఐ లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ ఆసుపత్రి సామర్థ్యం మాత్రం అదే స్థాయిలో కొనసాగుతోందని ఎంపీ పేర్కొన్నారు. అవసరమైన సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేకపోవడంతో అనేక మంది రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వస్తోందని, దీనివల్ల కార్మిక కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు చికిత్సలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. సామాజిక భద్రతా నియమావళి-2020తో సేవలపై మరింత డిమాండ్‌సామాజిక భద్రతా నియమావళి-2020 అమలుతో ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం పరిధి మరింత విస్తరించనున్న నేపథ్యంలో భవిష్యత్తులో నాణ్యమైన ఆరోగ్య సేవలపై డిమాండ్ మరింత పెరిగే అవకాశముందని ఎంపీ తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే ఆసుపత్రి మౌలిక సదుపాయాలను విస్తరించడం అత్యవసరమని పేర్కొన్నారు. 25 ఎకరాల ఖాళీ స్థలం విస్తరణకు అనుకూలంవిజయవాడ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో దాదాపు 25 ఎకరాల ఖాళీ స్థలం అందుబాటులో ఉందని, అదనపు భూసేకరణ అవసరం లేకుండానే ఆసుపత్రిని విస్తరించే అవకాశం ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక వైద్య సదుపాయాలతో కూడిన టెర్షియరీ కేర్ ఆసుపత్రిని నిర్మించాలని కేంద్రాన్ని కోరారు. 300 పడకల ఆసుపత్రి- ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలిప్రస్తుతం ఉన్న 110 పడకల ఆసుపత్రిని 300 పడకల టెర్షియరీ కేర్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు అదే క్యాంపస్‌లో ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం మరియు ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ తక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీ లోక్‌సభ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## తల్లికి వందనం నిధులను సక్రమంగా వినియోగించాలి

విజయవాడ :రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం క్రింద విద్యార్థుల పేరుతో వారి తల్లిదండ్రులకు ఇచ్చే రూ. 15 వేల ఆర్థిక సాయంలో ప్రతి ఒక్కరి నుండి రూ. 2 వేల చొప్పున మరుగుదొడ్ల నిర్వహణ నిధులు (టిఎంఎఫ్) పేరుతో కోత విధిస్తూ, కేటాయించిన నిధుల నుంచే ప్రతియేటా సుమారు రూ. 1000 కోట్లను టిఎంఎఫ్ పేరుతో తిరిగి తీసుకుంటోంది. ఈ ఏడాది తల్లికి వందనం క్రింద రూ. 10,120.78 కోట్లు కేటాయించారు.. అందులో రూ. 1,349.43 కోట్లను టిఎంఎఫ్ పేరుతో లబ్దిదారుల నుంచి వెనక్కి తీసుకోవడం జరిగింది. టిఎంఎఫ్ పేరుతో నిధులు కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్రంలోని వేలాది పాఠశాలల్లో నేటికీ మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం శోచనీయం. టిఎంఎఫ్ నిధులు ఏ రకంగా, ఎందుకోసం వినియోగిస్తున్నారో తెలియని ప్రశ్న తలెత్తుతోంది. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య నెలకొంది. రాష్ట్రంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 44,222 ఉన్నాయి. అందులో బాల, బాలికలు కలిసి చదువుకునే పాఠశాలలు 43,784 ఉన్నాయి. వీటిల్లో బాలురకు 6,050 పాఠశాలల్లో, 624 పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల సౌకర్యం లేదు. అంతేకాకుండా 35,452 పాఠశాలల్లో వికలాంగ విద్యార్థులకు అనుకూలమైన మరుగుదొడ్లు లేవు. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు బహిర్భూమి కోసం స్కూళ్లకు దగ్గరలో ఉన్న చెట్లు కలిగిన ప్రదేశాలకు గానీ, ఇళ్లగానీ వెళ్లాల్సిన దుస్థితి నెలకొనడం విచారకరం.

మరికొన్ని పాఠశాలల్లో పేరుకు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోయింది. ఆయా మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేకపోవడం, నిర్మాణ సమస్యలు వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలోని 155 ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా చాలా వరకు ఎయిడెడ్ పాఠశాలల్లోనూ సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిచోట్ల విద్యార్థులకు సరిపడా లేకపోవడం, మరికొన్ని చోట్ల నిర్వహణ కరువై పాడవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది.

## ఒడిస్సా సీఎం రేసులో ధర్మేంద్ర



భువనేశ్వర్ : నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, దేశ విద్యావిధానంలో లోపాలపై ఇటీవల కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నెల రోజులు ఆందోళన చేసింది. మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేసింది. చివరకు మంత్రి ప్రధాని వారించినా వినకుండా పదవికి రాజీనామా చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో మంత్రి పదవికి రాజానీమా చేసిన ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పుడు ఏం చేయబోతున్నారు అన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. ఒడిశా నుంచి కొన్ని సంకేతాలు వస్తున్నాయి. రాజీనామా తర్వాత వచ్చిన ప్రతిస్పందనలు భిన్నంగా ఉన్నప్పటికీ, ఇటీవల భువనేశ్వర్ ఎయిర్‌పోర్టులో కార్యకర్తలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన గ్రాండ్ వెల్కమ్ రాష్ట్ర రాజకీయాల్లో ఆయన పాత్రను గురించి కొత్త చర్చ మొదలైంది. నైతిక బాధ్యత తీసుకుని పదవి వదిలినట్లు చెప్పుకుంటున్నా, ఈ నిర్ణయం ఆయన రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపుతుందని కొందరు భావించారు. కానీ ఒడిశాలో మాత్రం విషయం వేరేలా కనిపిస్తోంది. ఎయిర్‌పోర్టు వద్ద జరిగిన స్వాగతం కేవలం ఆచారం కాదు. అనేక మంది రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరు కావడం ఆయనకు పార్టీలో ఇంకా బలమైన ఆధారం ఉందని స్పష్టం చేస్తోంది. రాజకీయ వర్గాలు దీన్ని ఆయన రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారే అవకాశంగా చూస్తున్నాయి. ప్రధాన్‌కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉందని స్థానిక స్థాయిలో చర్చలు మొదలైంది. ఇది కొందరు స్థానిక నేతల్లో కలవరాన్ని కలిగిస్తోంది. 2024లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆయన సీఎం అభ్యర్థిగా బలంగా ఉన్నప్పటికీ అధిష్ఠానం వేరే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మళ్లీ ఆ చర్చలు తలెత్తడం సహజం. అయితే వెంటనే మార్పు జరగడం సులభం కాదని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుత నాయకత్వం, సామాజిక సమీకరణలు, యువత అభిప్రాయం వంటి అంశాలు ఇందులో పాత్ర పోషిస్తాయి. ఇప్పటికీ అధికారికంగా ఏమీ స్పష్టం కాలేదు. ఆయనను కొంతకాలం విశ్రాంతి తీసుకునేలా చేయడం, పార్టీ సంస్థాగత పనుల్లో నియమించడం లేదా రాష్ట్ర రాజకీయాల్లో క్రమంగా పెద్ద పాత్ర ఇవ్వడం వంటి ఎంపికలు ముందున్నాయి. ఒడిశా బీజేపీలో ఆయనకు ఉన్న ప్రభావం, ఎమ్మెల్యేల మద్దతు బలంగా ఉన్నప్పటికీ, అంతిమ నిర్ణయం కేంద్ర అధిష్ఠానం చేతుల్లోనే ఉంది. ఆ నిర్ణయం ఎలా ఉంటుందనేది రాష్ట్రంలో అధికార సమీకరణలను, అంతర్గత సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఢిల్లీలో ఒక అధ్యాయం ముగిసినట్లు కనిపించినా, ఒడిశాలో మరో అధ్యాయం తెరవడానికి దారి తీస్తోంది. ఎయిర్‌పోర్టు స్వాగతం ఆ సంకేతాలను బలపరుస్తోంది. అయితే ఆయన రాష్ట్ర రాజకీయాల్లో ఎంత వరకు కీలకమవుతారు, సీఎం పాత్ర వైపు అడుగులు పడతాయా అనేది కేవలం సమయం,అధిష్ఠానం నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది.

## ఇన్సూరెన్స్ లేకపోతే.. పెట్రోల్, డీజిల్ బంద్..

భువనేశ్వర్ : బీమా లేని వాహనాలపై కఠిన చర్యలకు భారత అత్యున్నత న్యాయస్థానం సిద్ధమవుతోంది. మోటార్ థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించే లక్ష్యంతో సుప్రీంకోర్టు పలు కీలక ప్రతిపాదనలు చేసింది. ఇందులో భాగంగా, వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధృవీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ , కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖను ఆదేశించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించనున్నారు. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది. అంతే కాకుండా, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ కెమెరాలను వాహన్ డేటాబేస్, బీమా డేటాబేస్‌లతో అనుసంధానించాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది. దీంతో బీమా లేని వాహనాలను ఆటోమేటిక్‌గా గుర్తించి, అవసరమైతే ఇ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అతివేగం, రెడ్ సిగ్నల్ ఉల్లంఘన, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉపయోగిస్తున్న ంఔఖఖీ వ్యవస్థను బీమా ధృవీకరణకు కూడా వినియోగించాలని సూచించింది. రోడ్డు తనిఖీల సమయంలో ట్రాఫిక్ పోలీసులకు మొబైల్ యాప్‌లు లేదా హ్యాండ్‌హెల్డ్ పరికరాలను అందించి, వాహన బీమా వివరాలను తక్షణమే పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. దీంతో భౌతిక బీమా పత్రాలపై ఆధారపడకుండా అధికారులు ఆన్‌లైన్‌లోనే బీమా స్థితిని నిర్ధారించగలరు. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు తప్పనిసరి థర్డ్-పార్టీ బీమా కాలపరిమితిని కూడా పెంచాలని సుప్రీంకోర్టు సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు ప్రస్తుతం ఉన్న మూడు సంవత్సరాల బీమాను నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు సంవత్సరాల బీమాను ఆరు సంవత్సరాలకు పొడిగించాలని ప్రతిపాదించింది. ప్రారంభ బీమా గడువు ముగిసిన తర్వాత బీమా పునరుద్ధరించకుండా రోడ్లపై తిరిగే వాహనాల సంఖ్యను తగ్గించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని కోర్టు పేర్కొంది. ఇప్పుడు ఈ ప్రతిపాదనలను ఎలా అమలు చేయాలనే అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలించనున్నారు.

## బద్వేల్ పెద్ద చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

బద్వేలు : బద్వేల్ పట్టణం పెద్ద చెరువులో ఒక వివాహిత మహిళా దూకి ఆత్మహత్య చేసుకుంది పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్వేల్‌కు చెందిన ఆదిలక్ష్మి (50) అనే మహిళ గత కొంతకాలంగా కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురవుతోంది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన ఆమె, ముందుగా పేడలో చల్లుకునే పురుగుల మందు (పౌడర్) తాగింది. అనంతరం పట్టణంలోని పెద్ద చెరువు వద్దకు చేరుకుని అందులోకి దూకేసింది. గమనించిన స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ, ఆమె అప్పటికే నీట మునిగి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న బద్వేల్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీశారు. అనంతరం కేసు నమోదు చేసుకుని, శవపంచనామా నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కొరకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## గిరిజన పేద ప్రజలకు భూములు పంపిణీ చేయాలి

**గిరిజన సమాఖ్య డిమాండ్, వినతి పత్రం సమర్పణ**

నరసరావుపేట : వినుకొండ నియోజకవర్గంలోని గల బొల్లాపల్లి మండలం గండి గనుమల గ్రామ సర్వేనెంబర్ 430 లో ప్రభుత్వ బంజర భూమి ఏ 169.80 సెంట్లు కలదు. కొంతకాలం క్రితం గిరిజన, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు తెలియజేసి అర్జీలు ఇవ్వడం జరిగింది. ఈ మేరకు సర్వే చేస్తామని రెవిన్యూ అధికారులు ఇంతవరకు చేపట్టడం లేదని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలోడిఆర్ఓ అధ్యక్షువినతి పత్రం అందజేయడం జరిగింది. గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. నేటి వరకు రెవిన్యూ పరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. ఆ భూమి కొంతమేరకు గిరిజన ప్రజలు సాగు చేసుకుంటున్నారు. మరి కొంత భూమి బీడుగా ఉంది. నిరుపేదలైన గిరిజన ప్రజలకు భూ పంపిణీ చేస్తే వారి జీవన భృతికి ఉపయోగ పడుతుందన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమగ్ర సర్వే జరిపి, నిరుపేద గిరిజనులకు భూములు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి కోయ శ్రీన, ఉపాధ్యక్షులు పాలపర్తి కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ నాయకులు బి. రాంబాబు నాయక్, తోపాటు పలువురు పాల్గొన్నారు.

## కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు.బి. రాజు**

సి. బెళగల్ : మండల కేంద్రంలోని స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట,భారత కమ్యూనిస్టు పార్టీ ,మరియు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో, కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి.రాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని,పంట వేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని,వర్షాలు పడితే తిరిగి విత్తనాలు వేయడానికి ఉచితంగా విత్తనాలు ఎరువులు ఇవ్వాలని, మూగజీవాలకు పశుగ్రాసం నీటి సౌకర్యాలు కల్పించాలని,గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని,రైతులకు తీసుకున్న అన్ని బ్యాంకులలో వ్యవసాయ రుణాలను రద్దుచేసి,కొత్త రుణాలు ఇవ్వాలని,పంటల భీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి, రైతులు కట్టిన ప్రీమియాన్ని తిరిగి ఇవ్వాలని,కరువు కారణంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి రైతు కుటుంబానికి,చౌకధర దుకాణాల ద్వారా, 15 రకాల నిత్యవసర వస్తువులను,ఉచితంగా పంపిణీ చేయాలని, తొమ్మిది రకాల వినతులను, ప్రభుత్వానికి తెలిపారు. అనంతరం మండల రెవెన్యూ అధికారి ఈరంరెడ్డి వెంకటలక్ష్మికి, సిపిఐ,ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సభ్యులు,రైతులందరూ కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మార్వో వెంకటలక్ష్మి సానుకూలంగా స్పందిస్తూ,మీ యొక్క వినితిని ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, బి రాజు, సిపిఐ కార్యకర్తలు, రైతు సంఘం సభ్యులు, సి. బెళగల్ మండల సిపిఐ కార్యవర్గ సభ్యులు పకీరప్ప, శేషు,మల్లి, చిన్న నాగన్న, రవి, చిన్న ఈరన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రాజుపాలెం మండలం రాజుపాలెంలో గ్యాస్ సిలిండర్ పేలి ఓ వ్యక్తికి తీవ్ర గాయలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా వుంది. రాజుపాలెంఆర్ ఆర్ సెంటర్ ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలింది. స్థానికులు వెంటనే బాధితుడు పవన్ కుమార్ ను సత్తెనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. పవన్ కుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఏరియా హాస్పిటల్ కి తరలించారు

## ఆత్మకూరు - నంద్యాల తిరిగే బస్సులు సమయాన్ని పాటించాలి

**ప్రయాణికులకు అనుగుణంగా బస్సు సర్వీసులు పెంచాలి**

ఆత్మకూరు : ఆత్మకూరు - నంద్యాల, నంద్యాల నుంచి ఆత్మకూరు తిరిగే బస్సులు సమయాన్ని పాటించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని, అదనంగా బస్సు సర్వీసులు పెంచాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. ఏసురత్నం, పట్టణ కార్యదర్శి ఏ.రణధీర్ లు అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ సీఐ నాయక్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టింది. ఈ పథకం వల్ల ప్రయాణికుల సంఖ్య తీవ్రంగా పెరిగిందన్నారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు లేవు. ఆత్మకూరు నుంచి నంద్యాల తిరిగే బస్సులు సమయాన్ని పాటించడం లేదు. బస్సులన్నీ ఒకేసారి పోవడం ఒకేసారి రావడం మెజార్టీగా జరుగుతుందన్నారు. 80 మంది ప్రయాణికులు బస్సులు ఉంటే చాలు అనే కోణంలో చాలామంది డ్రైవర్స్ బస్సులను ఆపకుండా వెళుతున్నారు. చదువుకునే పిల్లలకు బడులకు పోయే పిల్లలకు వీటివల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజు సాయంకాలము 5 గంటల నుంచి ఏడు గంటల వరకు నంద్యాలలో బస్సులు ఉండడం లేదు బస్సులన్నీ కూడా ఒకటేసారి మూడు నాలుగు బస్సులు వస్తున్నాయి ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు వందల మంది ప్రయాణికులు బస్టాండ్లో ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలేజీ పిల్లలు మహిళలు చాలా ఇబ్బందులు పడి నిరాశకు గురి అవుతున్నారు. నంద్యాల నుంచి ఆత్మకూరుకు సాయంకాలం బస్సులు సమయానికి నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆత్మకూరు నుంచి నంద్యాలకు గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి ప్రయాణికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది అందుకు అనుగుణంగా అదనంగా బస్సులు పెంచాలి, నంద్యాల నుంచి ఆత్మకూరుకు ఎక్స్‌ప్రెస్ బస్సులను నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామ్ నాయక్, వీరన్న, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ అట్లూరు విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ

బద్వేలు : బద్వేలు నియోజకవర్గం, అట్లూరు మండలం లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం లో జాతీయ స్థాయిలో క్రీడలకు ఎంపికైన విద్యార్థినులకు సోమవారం బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి తన స్వంత నిధులతో క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ ప్రతిభ కనబరచడం ఆనందకరమని అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో 23 రకాల క్రీడల్లో రాణించడం పాఠశాల, ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అభినందించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యాసంస్థలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. "షైన్ స్టార్ అవార్డ్స్", "తల్లి కి వందనం" వంటి పథకాల ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహం అందుతోందని పేర్కొన్నారు. అలాగే కస్తూరిబా కళాశాలలో అట్లూరులో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించగా, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థినులకు 10000/- ప్రత్యేక ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్షా అభియాన్ జిల్లా అధికారి, ఎంపీడీవో, ఎంఈఓలు,బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు,స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అనంతరం సూర్యనారాయణ రెడ్డి విద్యార్థినులతో కలిసి సాఫ్ట్‌బాల్ ఆటలో పాల్గొని వారికి ఉత్సాహం నింపారు.

# ఆగస్టు 11న రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్ కొత్త దేశం




న్యూఢిల్లీ : బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయం ప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచిస్తాన్.. పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం. 45 శాతం భూభాగం కలిగి ఉంటుంది. 1948లో బలూచిస్తాన్‌ను పాకిస్తాన్ బలవంతంగా కలుపుకుంది. కొన్ని రోజులు బాగానే ఉన్నా.. వివక్షతో బలూచిస్తాన్ పాకిస్తాన్ నుంచి విడిపోవాలని కోరుకుంటోంది. ఈ క్రమంలో స్వాతంత్ర్యం కోసం పోరాటం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇటీవల స్వయంప్రకటిత "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. ఆగస్టు 11న స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవాలని పిలుపునిచ్చింది. బలూచ్ జాతీయవాదులు 1947 ఆగస్టు 11న కలాత్ రాజ్యం (ఆధునిక బలూచిస్తాన్‌లోని ముఖ్య భాగం) స్వతంత్రంగా ప్రకటించబడిందని చెబుతారు. బ్రిటిష్ వైదొలగడం సమయంలో కలాత్ ఖాన్‌తో స్టాండ్‌స్టిల్ ఒప్పందం కుదిరి, దానిని స్వతంత్ర సార్వభౌమ రాజ్యంగా గుర్తించినట్లు కొన్ని నివేదికలు ఉన్నాయి. అయితే 1948 మార్చిలో పాకిస్తాన్ సైన్యం జోక్యం చేసుకుని కలాత్‌ను విలీనం చేసింది. బలూచ్ వైపు ఇది బలవంతపు విలీనం అని, పాకిస్తాన్ వైపు ఇది చట్టబద్ధమైన అనుసంధానం అని వాదనలు ఉన్నాయి. అయితే ఈ చారిత్రక అసంతృప్తి ఆధారంగా 1948 నుంచి అనేక తిరుగుబాటు దశలు జరిగాయి. ప్రస్తుత ఉద్యమం దాని కొనసాగింపుగా కనిపిస్తుంది. 2026 జూలైలో మిర్ యార్ బలోచ్ వంటి నాయకులు "రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్తాన్" పేరుతో స్వాతంత్ర్యం ప్రకటించారు. వారు జాతీయ జెండా, గీతం, కరెన్సీ (బలోచి ఫాలస్) ప్రవేశపెట్టినట్లు, 85 శాతం భూభాగంపై నియంత్రణ ఉన్నట్లు, స్వంత పరిపాలనా వ్యవస్థ ఉన్నట్లు దావా చేశారు. ఆగస్టు 3, 2026న ఆగస్టు 11ను స్వాతంత్ర్య దినోత్సవంగా ప్రకటించి, ప్రపంచవ్యాప్తంగా జెండా ఎగురవేసి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఇది 1947 చారిత్రక తేదీపై ఆధారపడి ఉంది. అయితే ఈ దావాలు స్వతంత్రంగా ధ్రువీకరించబడలేదు. ఏ దేశం లేదా అంతర్జాతీయ సంస్థ ఈ "రిపబ్లిక్"ను గుర్తించలేదు. బలూచిస్తాన్ అంతర్జాతీయంగా పాకిస్తాన్ ప్రావిన్స్‌గానే కొనసాగుతోంది. బలూచ్ వైపు ప్రధాన ఆరోపణ సహజ వనరులు (గ్యాస్, ఖనిజాలు, గ్వాదర్ పోర్ట్) స్థానికులకు ప్రయోజనం లేకుండా చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్ ద్వారా బయటకు వెళ్తున్నాయని, యువతపై అణచివేత, మహిళలు మాయం కావడం వంటి మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయని పేర్కొంటోంది. బీఎల్‌ఏ వంటి సమూహాలు ఈ కారణాలతో పోరాటం చేస్తున్నాయని చెబుతాయి. ఈ ఆరోపణలు హ్యూమన్ రైట్స్ సంస్థలు, కొన్ని అంతర్జాతీయ నివేదికలలో కూడా ప్రస్తావించబడ్డాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఈ సమూహాలను ఉగ్రవాద సంస్థలుగా పరిగణిస్తుంది. బీఎల్‌ఏను కొన్ని దేశాలు విదేశీ ఉగ్రవాద సంస్థగా గుర్తించాయి. బీఎల్‌ఏ, ఇతర సమూహాలు సైనిక స్థావరాలు, మౌలిక వసతులపై దాడులు చేస్తూ ఉన్నాయి. 2026లో కోఆర్డినేటెడ్ దాడులు జరిగాయి, కానీ పాకిస్తాన్ సైన్యం కౌంటర్?ఆపరేషన్లు కొనసాగిస్తోంది. ప్రావిన్స్‌పై పూర్తి నియంత్రణ బలూచ్ సమూహాల చేతుల్లో ఉందన్న దావా స్వతంత్ర మూలాల ద్వారా నిర్ధారించబడలేదు. పాకిస్తాన్ ప్రభుత్వం, సైన్యం ఇప్పటికీ అధికారిక నిర్వహణలో ఉన్నాయి. స్వాతంత్ర్య ప్రకటన చట్టపరంగా రాజకీయ వ్యక్తీకరణగా ఉండవచ్చు, కానీ ప్రభావవంతమైన ప్రభుత్వం, విదేశీ సంబంధాల సామర్థ్యం రాష్ట్రంగా నిలబడటానికి అవసరమైన అంశాలు లేవు. బలూచిస్తాన్ సమస్య చారిత్రక అసంతృప్తి, వనరుల పంపిణీ అసమానత, మానవ హక్కుల ఆరోపణలు, సాయుధ పోరాటాల మిశ్రమం. స్వయంప్రకటిత స్వాతంత్ర్యం గుర్తింపు పొందకపోయినా, ఉద్యమం కొనసాగుతోంది. శాంతియుత రాజకీయ పరిష్కారం, స్థానిక అభివృద్ధి, మానవ హక్కుల రక్షణ లేకుండా ఈ సంఘర్షణ మరింత సంక్లిష్టం కావచ్చు. పాకిస్తాన్ ఎలా స్పందిస్తుందో, అంతర్జాతీయ సమాజం ఎలా చూస్తుందో ఆగస్టు 11 తర్వాత స్పష్టం అవుతుంది.

# భూ పరిహార చెల్లింపులో జాప్యం

## ఆర్డీవో కార్యాలయ ఆస్తుల జప్తుకు కోర్టు ఆదేశం

వికారాబాద్ : వికారాబాద్లో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ పరిహార వివాదం సంచలన మలుపు తిరిగింది. కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ రైతుకు చెల్లించాల్సిన పరిహారం ఇప్పటికీ అందించకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వికారాబాద్ సీనియర్ సివిల్ కోర్టు... ఏకంగా ఆర్డీవో కార్యాలయంలోని కదిలే ఆస్తులను జప్తు చేయాలని ఆదేశించింది. కోర్టు బెలిఫ్ కార్యాలయానికి చేరుకుని జప్తు ప్రక్రియ చేపట్టగా, అనంతరం రెండు నెలల్లో రూ.61.29 లక్షల పరిహారం చెల్లిస్తామని అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వడంతో జప్తు చేసిన వస్తువులను తిరిగి కార్యాలయ కస్టడీకే అప్పగించారు. 1986-87లో రైల్వే ప్రాజెక్టు కోసం రైతు శశాంక్ రెడ్డికి చెందిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోగా, అప్పట్లో గజానికి కేవలం రూ.50 మాత్రమే పరిహారం నిర్ణయించారు.

దీనిపై కోర్టును ఆశ్రయించిన రైతు... జిల్లా కోర్టు నుంచి హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేసి చివరకు గజానికి రూ.125 చొప్పున పరిహారం పొందే హక్కును సాధించుకున్నారు.

అయినప్పటికీ పరిహారం చెల్లింపులో జాప్యం కొనసాగడంతో కోర్టు ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. నాలుగు దశాబ్దాలుగా సాగుతున్న ఈ భూ పరిహార పోరాటం ఇప్పుడు జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం

## - సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్

సి.బెళగల్: రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా అంతర పంటల సాగు చేపట్టడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సి.బెళగల్ మండల వ్యవసాయ అధికారి జి. మల్లేష్ కుమార్ తెలిపారు. "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో భాగంగా ముడుమాల, ఈర్లదిన్నె, కొత్తకోట గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, కూరగాయలు, జీలుగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి రైతు మోనోక్రాపింగ్ (ఒకే పంట సాగు) విధానాన్ని విడిచిపెట్టి ప్రధాన పంటతో పాటు రెండు లేదా అంతకంటే ఎక్కువ అంతర పంటలను సాగు చేయాలని సూచించారు. ముఖ్యంగా పత్తి పంటలో పెసలు, మినుములు, కొర్రలు, సజ్జలు, జొన్నలు వంటి పప్పుధాన్యాలు, చిరుధాన్యాలను సాగు చేస్తే ప్రధాన పంటతో పాటు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. అంతర పంటల వల్ల రైతులకు ఆర్థిక లాభమే కాకుండా, పశువులకు నాణ్యమైన మేత కూడా లభిస్తుందని చెప్పారు. అలాగే నవధాన్యాల విత్తనాలను పొలంలో చల్లడం వల్ల వర్షాలు కురిసిన తర్వాత అవి మొలకెత్తి భూమిని కప్పి ఉంచడంతో కలుపు మొక్కల పెరుగుదల తగ్గడంతో పాటు భూమిలో తేమ నిల్వ ఉండి ప్రధాన పంటకు కూడా ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ప్రతి రైతు తమ పొలం గట్ల (ఫార్మ్ బండ్స్) వద్ద కనీసం ఎకరానికి ఒక మొక్క చొప్పున కానుగ, వేప, మామిడి, టెంకాయ వంటి చెట్లను నాటాలని ఆయన సూచించారు. ఇవి భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు ఆదాయ వనరులుగా కూడా ఉపయోగపడతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ముడుమాల గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వద్ద 10 కిలోల నవధాన్యాల కిట్ రూ.800కు అందుబాటులో ఉందని, ఆసక్తి ఉన్న రైతులు వాటిని తీసుకుని తమ పొలాల్లో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు హిమబిందు, నాగశిరీష, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఆఫ్రిన్, విజయలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రవిసాగర్, శేఖర్, వీరన్నతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# కాళేశ్వరమే అజెండా




హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తతలకు వేదికగా మారింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మొదటి నుంచి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె. చంద్రశేఖర్ రావు నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని విసురుతున్న సవాళ్లు.. ఈసారి సభలో తీవ్ర దుమారం రేపేలా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రూ. లక్ష కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం , మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, నిధుల వినియోగంపై జరగనున్న చర్చే ఈ సమావేశాల్లో ప్రధానాంశంగా మారనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయంగా, పరిపాలనాపరంగా తమకు ప్రధాన ఆయుధంగా మార్చుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుండగా, రైతుల నీటి అవసరాలను చూపుతూ ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మేడిగడ్డ నుంచి నీళ్లను ఎత్తిపోయాలి అని చేపట్టిన నిరసనలు, క్షేత్రస్థాయి ఉద్యమాలు రాజకీయాన్ని వేడెక్కించాయి. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి నుంచి వరద నీరు సహజంగానే తిరిగి మేడిగడ్డ వైపు ప్రవహించడం, బ్యారేజీ సాంకేతిక పరిమితులు బయటపడటంతో బీఆర్ఎస్ ఒక్కసారిగా తీవ్ర ఆత్మరక్షణలో పడింది. ఇరిగేషన్ నిపుణులు, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలను ముందుపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పడం బీఆర్ఎస్‌కు సవాలుగా మారింది. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిన పరిస్థితుల్లో నీటిని నిల్వ చేయడం లేదా పంపింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని ప్రభుత్వం వాదిస్తుంటే.. బీఆర్ఎస్ మాత్రం కేవలం పొలాలకు నీళ్లు ఇవ్వకుండా నాటకాలు ఆడుతోందని ఆరోపించింది. అయితే, వరద నీటి సహజ ప్రవాహం, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ పరిణామాలు క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ వాదనకే బలాన్ని చేకూర్చడంతో, సోషల్ మీడియాలో సైతం బీఆర్ఎస్ రక్షణ ధోరణిలో పడాల్సి వచ్చింది. ఈ వర్షాకాల సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వ్యూహం అత్యంత స్పష్టంగా ఉంది. కేసీఆర్‌ను నేరుగా అసెంబ్లీకి రప్పించడం ద్వారా, ఆయన సమక్షంలోనే కాళేశ్వరం డిజైన్ లోపాలు, పీసీ ఘోష్ కమిషన్ విచారణ పురోగతి, మరియు రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని ఎండగట్టాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత సమావేశాలకు కేసీఆర్ దూరంగా ఉండటాన్ని రేవంత్ రెడ్డి రాజకీయంగా వాడుకుంటూ.. ప్రతిపక్ష నేతగా సభకు వచ్చి తమ హయాంలో జరిగిన నిర్మాణాలను సమర్థించుకోవాలని సవాల్ విసురుతున్నారు. మరోవైపు, బీఆర్ఎస్ వర్గాలు కూడా ఈ సమావేశాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. కాళేశ్వరం అంశంలో సాంకేతిక లోపాలను సరిదిద్దకుండా ప్రభుత్వం రాజకీయం చేస్తోందని, ఆరుగాలం కష్టపడే రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని సభలో తిప్పికొట్టేందుకు కేటీఆర్, హరీష్ రావులు వ్యూహాలు రచిస్తున్నారు. అయితే, కేసీఆర్ స్వయంగా అసెంబ్లీకి వస్తారా లేదా అనేది ఇంకా ఉత్కంఠగానే మారింది. ఒకవేళ కేసీఆర్ సభకు హాజరైతే రేవంత్-కేసీఆర్ మధ్య జరిగే ప్రత్యక్ష సభ సమరం తెలంగాణ రాజకీయ చరిత్రలోనే అత్యంత కీలకమైన ఘట్టంగా మారనుంది. ఈ వర్షాకాల సమావేశాల్లో కాళేశ్వరంపై జరిగే చర్చ ప్రజాభిప్రాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనుంది. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ రీ-డిజైన్ వైఫల్యం గా ప్రజల్లో శాశ్వతంగా ముద్ర వేయాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తుంటే.. కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు ఎండిపోతోంది అని నిరూపించేందుకు బీఆర్ఎస్ పోరాడుతోంది. అదే సమయంలో నిరుద్యోగ సమస్యలు సహా రాష్ట్రంలో ఉన్న అన్ని అంశాలను హైలెట్ చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ అసెంబ్లీ సమావేశాలు కేవలం చట్టసభల చర్చలకే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయ గమనాన్ని నిర్దేశించే అత్యంత కీలక పోరాట వేదికగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఆదివాసుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

## ప్రతి జిల్లా కేంద్రానికి సుమారుగా 2 లక్షలు కేటాయించాలి
## గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్

నరసరావుపేట : ప్రపంచములో అందరికంటే ఎక్కువగా దోపిడికి గురి అవుతున్నది గిరిజన ప్రజలే, అందుకు ప్రధాన కారణం విద్య, ఆర్థిక అసమానతలు, అమాయకత్వం, సామాజిక స్పృహ లేకపోవడం గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినా అవి గిరిజనులకు అందని ద్రాక్షా గానే ఉంది. దీని వలన గిరిజన ప్రజలు మరింత ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడుతున్నారు. గిరిజనుల జీవనోపాధి కోసం జీవించే హక్కు కోసం తమకు రావలసిన హక్కు కోసం నిరంతరం పోరాటాలు చేయడం ఫలితంగానే 1993 ఆగష్టు 9న అంతర్జాతీయ గిరిజన దినోత్సవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి గుర్తించి ప్రకటించటమైనదని గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. శ్రీను నాయక్ అన్నారు. నరసరావుపేట సిపిఐకార్యాలయంలో పాత్రికేయుల సమావేశ నిర్వహించారు. ఈ నేపద్యంలోనే ఐక్యరాజ్యసమితి కొన్ని అంశాలను గుర్తించిందని వాటిలో 1). స్వయం నిర్ణయామిక హక్కు, 2). ప్రభుత్వ జాతీయ కార్య కలాపాలలో పాల్గోనే హక్కు 3). వివక్ష నుంచి స్వేచ్ఛ హక్కు,4.) ఒక నిర్దిష్ట, విశిష్ట సమానంగా మనుగడ సాధించేందుకు 5). గిరిజనులకు అవకాశాలు సన్నగిల్లడం, విశిష్టత, విద్య, వైద్యం, సమాచారం, శ్రమ హక్కులు, 6) అభివృద్ధి, ఇతర ఆర్థిక సాంఘీక హక్కులతు, భూమి, ఇతర వనరులపై హక్కులు, 7. స్వంత వ్యవస్థలను నిర్వహించుకునే హక్కులను ఐక్యరాజ్యసమితి గుర్తించి తీర్మాణం చేయడంలో అన్ని దేశాల సంతకాలు పెట్టాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రభుత్వాలు నూతన ఆర్థిక విధానాల పేరుతో చేస్తున్న చట్టాలు ఎన్ని తెచ్చినా, శాసనాలు, ఎన్ని అమలు చేసినా గిరిజనులకు ఉన్న హక్కులు అమలు పరచటంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి గిరిజన ప్రజలు వారి.. వారి అవకాశాలను బట్టి కొంత మంది అడవులలో వ్యవసాయం చేసుకొంటున్నారు, మరికొంత మంది చిన్న.. చిన్న తండాలను, గుడాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అతి తక్కువ మంది పట్టణాలల్లో నివాసాలుగా ఉంటున్నారు. ఈ విధంగా జీవన విధానంలో మార్పులు వస్తున్నప్పటికి మన గిరిజన సంస్కృతిక సాంప్రదాయాలను కాపాడు కోవలసిన అవసరం, ఆవస్యకత ఎంతైనా ఉందన్నారు. భారత రాజ్యాంగములోని 5వ మరియు 6వ షెడ్యులలో గిరిజనులకు భూమిని సొంతం చేసుకునే హక్కు చట్టపరంగా పత్రాలు సైతం కల్పించినప్పటికీ, భూమి పై హక్కులను నిర్వీర్యం చేయుడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. స్వయం పరిపాలన చేసుకునే అధికారం ఉన్నప్పటికి అదే విధంగా మౌలికమైన అంశాలపైన స్వతంత్ర ప్రతిపత్తి ఉన్నప్పటికి స్వతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్న, పార్లమెంటు, శాసన సభలను ఎలాంటి చర్చలు చేయకుండా అలాంటి విషయాలు గిరిజన ప్రజలకు తెలియకుండా పాలక వర్గాలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల తొమ్మిదో తేదీన నిర్వహిస్తున్న ఆదివాసుల దినోత్సవం కంటితుడువుగా కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రానికి సుమారుగా 2 లక్షల రూపాయలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి కొయ శ్రీను, సహాయ కార్యదర్శి పాలపర్తి వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు మొగిలి అనురాధ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# రేవంత్ ధీమా వెనుక...



మహబూబ్ నగర్ : తెలంగాణ రాజకీయ చరిత్రలో 2023 అసెంబ్లీ ఎన్నికలు ఒక మలుపు. అప్పటి వరకు పలువురు విశ్లేషకులు, రాజకీయ వర్గాలు కాంగ్రెస్ పార్టీని పూర్తిగా పక్కన పెట్టేసినట్లు చూశారు. అయితే ఆ అంచనాలన్నీ తలకిందులైపోయాయి. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరో మూడు పర్యాయాలు అధికారం కొనసాగుతుందనే ధీమాతో ముందుకు సాగుతోంది. 2018 నుంచి 2023 మధ్య కాలంలో జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ పెరుగుతున్న బలం స్పష్టంగా కనిపించింది. కాంగ్రెస్ అక్కడక్కడా కనిపించకపోవడంతో, అసలు పోటీ బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే జరుగుతుందని చాలామంది భావించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా బీజేపీని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని రాజకీయ వ్యూహాలు రచించారు. ఓట్లు చీలిపోతే మూడోసారి అధికారం సాధ్యమవుతుందని గులాబీ పార్టీ నాయకులు అంచనా వేశారు. అయితే జరిగింది వేరే. బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి ఓట్లు అన్నీ ఒకే చోటకు కేంద్రీకృతమయ్యాయి. ఆ ఫలితం కాంగ్రెస్‌కు దక్కింది. ఇక్కడ రేవంత్‌రెడ్డి పాత్ర కీలకమైంది. కేసీఆర్‌కు నిజమైన ప్రత్యామ్నాయం తానేనని స్పష్టంగా చాటుకున్నారు. పార్టీలోని అనేక అగ్ర నేతలను సమన్వయం చేసుకుని, ఏకగ్రీవ నాయకత్వం ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. ఫలితంగా ప్రజల్లో విశ్వాసం పెరిగి, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. గడచిన 30 నెలలుగా ఆయన తనదైన శైలిలో పాలన సాగిస్తున్నారు. రేవంత్ రెడ్డి ప్రతి సభలోనూ, పార్టీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ మరో మూడు పర్యాయాలు గెలుస్తుందని స్పష్టంగా చెబుతున్నారు. ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో కూడా 2034 వరకు తానే ఉంటానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇది కేవలం కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే ప్రయత్నం మాత్రమే కాదు. దీని వెనుక దీర్ఘకాలిక రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. కాంగ్రెస్‌లో సాధారణంగా వర్గపోరులు పార్టీని బలహీనపరుస్తాయి. అయితే ఏక నాయకత్వం ఉన్నప్పుడు ఆ పార్టీ అద్భుతాలు సృష్టించగలదని గత చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ఆ లోటును తీరుస్తున్నారని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. దీనివల్ల తెలంగాణలో కాంగ్రెస్ బలం మరింతగా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా బీజేపీపై అసంతృప్తి మెల్లగా పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇది కాంగ్రెస్‌కు అనుకూల పరిస్థితిని సృష్టిస్తోంది. ఇండియా కూటమిలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న కాంగ్రెస్, 2029లో కేంద్రంలో అధికారం సాధించగలమని నమ్మకంతో ఉంది. దక్షిణ భారతదేశంలోనే కాంగ్రెస్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. తెలంగాణ, కర్ణాటక, కేరళల్లో అధికారంలో ఉండటం, తమిళనాడులో భాగస్వామ్యం ఇలాంటి అంశాలు ఆ పార్టీకి బలం చేకూరుస్తున్నాయి. యువతలో కూడా కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి ఉందని, వారు జాతీయ స్థాయిలో బలమైన ప్రత్యామ్నాయంగా కాంగ్రెస్‌ను ఎంచుకోవచ్చని రేవంత్ అంచనా వేస్తున్నారు. ఈ జాతీయ పరిణామాలు తెలంగాణలోని స్థానిక రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతాయి. 2028 ఎన్నికల నాటికి ఈ పరిస్థితులు మరింత బలపడితే, కాంగ్రెస్‌కు మరోసారి విజయం సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయం. కాంగ్రెస్ బలం పెరుగుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. గతంలో బలమైన ప్రాంతీయ పార్టీగా నిలిచిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి తన స్థానాన్ని కాపాడుకోవాల్సిన సవాలు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్‌లో ఏక నాయకత్వం కొనసాగితే, ప్రాంతీయ పార్టీలకు మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పునరాగమనం కేవలం ఒక ఎన్నికల ఫలితం మాత్రమే కాదు. బలమైన నాయకత్వం, జాతీయ పరిస్థితులు, యువత ఆకాంక్షలు కలిసి ఒక కొత్త రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. రేవంత్ రెడ్డి చెబుతున్న మూడు టర్మ్‌ల లక్ష్యం నిజమవుతుందా లేదా అనేది కాలం నిర్ణయిస్తుంది. అయితే ప్రస్తుత పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలంగానే కనిపిస్తున్నాయి.

# రాష్ట్రంలో ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉంది

## శ్వేతపత్రం విడదల చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి : స్పష్టమైన విజన్తో, హామీలు నెరవేరుస్తూ, నమ్మకాన్ని నిలబెట్టుకుని సాగుతున్నాం. ప్రజలకు వాస్తవాలు ఎప్పటికప్పుడు చెబుతున్నాం.. వారు పాజిటివ్ గా స్పందిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు.

మంగళవారం నాడు అయన రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై శ్వేతపత్రం విడుదల చేసారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ అయిదేళ్ల విధ్వంసం కలిగించిన నష్టాలు ఇంకా మనల్ని వేధిస్తూనే ఉన్నాయి.. ఎల్నినో వంటివి వచ్చినా సరే.. భయపడని, సుస్థిరమైన మెకానిజం లను తయారుచేయాలి. అలాగే గ్రామీణ స్వయం సహాయక సంఘాలు బ్యాంకులద్వారా రుణాలు పొందడంలో ఏపీ- భారత్లో నెంబర్ వన్ గా నిలుస్తోంది. 97 శాతం సంస్థలు బ్యాంకు రుణాలు పొందాయి.. యాభై శాతానికి పైగా స్వయం ఉపాధులకు రుణాలు వాడుతున్నాయి. సంఘాల రుణాల ప్రక్రియను పూర్తి డిజిటలైజ్ చేయడం ద్వారా.. ఏపీ దేశంలోనే రోల్ మాడల్ గా ఆవిర్భవించింది. ప్రధాని స్వానిధి సపోర్ట్ పొందడంలో ఏపీ దేశంలోనే నెంబర్ టూగా ఉంది. సంఘాలు సాధించిన అద్వితీయ విజయాలివని అన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం విపరీతంగా పెరిగిపోయిందని చంద్రబాబు అంకెలతో సహా వివరించారు. "2014-15లో తెలంగాణ, ఏపీ మధ్య తలసరి ఆదాయ వ్యత్యాసం రూ.30,201గా ఉండేది. మా ఐదేళ్ల పాలనలో దాన్ని రూ.25,000కు తగ్గించగలిగాం. కానీ, 2019-24 మధ్య కాలంలో ఈ వ్యత్యాసం ఏకంగా రూ.1,06,854కు పెరిగిపోయింది. ఒకవేళ 2014-19 మధ్య సాధించిన 13.5% వృద్ధిరేటు కొనసాగి ఉంటే, రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చేది. అప్పుడు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదు" అని ఆయన విశ్లేషించారు. రూ.9.74 లక్షల కోట్ల అప్పు చేసి వెళ్లిన జగన్ ప్రభుత్వం తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గత తప్పులను సరిదిద్దడంతో పాటు ప్రజలు మరియు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరించాల్సి వచ్చింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించాల్సి వచ్చింది. ఇందుకోసం కూటమి ప్రభుత్వం చతుర్ముఖ వ్యూహంతో ముందుకెళ్లిందని అన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను నిర్ణయించే తలసరి ఆదాయం విషయంలో విభజన తర్వాత ఏపీ వెనుకబడింది. అహరహమూ కష్టపడుతూ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచి తద్వారా వారి జీవన ప్రమాణాలు కూడా పెంచుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకుంటూ, ఖర్చులను అదుపు చేస్తూ ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పిపిపి, వైబిలిటీ గ్యాప్ ఫండింగ్ (ఎఉఈ) ద్వారా మూలధన వ్యయాన్ని పెంచుతామని తెలిపారు. అంతిమంగా రాష్ట్రాన్ని ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన సమాజంగా తీర్చిదిద్ది, 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సాధించడమేతమ ధ్యేయమని స్పష్టం చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# పెళ్లైన నెలకే పాము కాటుతో నవవరుడు మృతి

పత్తికొండ : సంబరాల్లో మునిగితేలాల్సిన ఆ ఇంట్లో ఒక్కసారిగా తీవ్ర విషాదం అలముకుంది. నూరేళ్ల పంటగా భావించి వేసిన తాళి ముడి వేసి నెల రోజులు కూడా కాకముందే పాము కాటుకు గురై నవవరుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకెళ్తే స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హోసూర్ గ్రామానికి చెందిన మాలరవి దేవనకొండకు చెందిన లక్ష్మీతో నెల కిందట ఎంతో వైభవంగా వివాహం జరిగింది. ఇరు కుటుంబాల్లోనూ పండుగ వాతావరణం నెలకొంది.జరిగిందని కుటుంబీకులు తెలిపారు. అయితే ఆషాడం కావడంతో పుట్టింటికి వెళ్లిన భార్యను చూసేందుకు రెండు రోజుల కిందట దేవనకొండకు వెళ్లాడు. నిద్రిస్తుండగా.. పాము కాటేయడంతో మరణించాడని కుటుంబీకులు తెలిపారు..

కుటుంబంలో నిండిన శోకసంద్రం: కళ్లెదుటే కొత్తగా పెళ్లైన భర్త ప్రాణాలు కోల్పోవడంతో నవవధువు రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. "నెల రోజులైనా నిండకముందే నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయావా" అని ఆమె విలపిస్తున్న తీరు చూసి గ్రామస్తులు తీవ్రగ్భ్భ్రాంతికి గురయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

# సుఖ వ్యాధులపై అవగాహనా కార్యక్రమం

చాగలమర్రి : చాగలమర్రి పట్టణంలోని కొత్త ఎస్సీ కాలనీ నందు దిశ డిస్ట్రిక్ట్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటెజీ ఫర్ హెచ్ఐవి/ఎయిడ్స్ ఆళ్లగడ్డ సి ఈ ఆర్ డి ఎస్ ఎన్ జి ఓ వారి ఆధ్వర్యంలో గ్రామస్థాయిలో సంచార వాహనం ద్వారా సుఖ వ్యాధులకు సంబంధించి హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరిగింది.18 సంవత్సరాలు పై బడిన వారు కచ్చితంగా పరీక్షలు చేయించుకుని వారి స్థితి ని తెలుసుకోగలరని ఈ పరీక్షల ద్వారా వ్యాధులు ఏవైనా ఉంటే త్వరగా గుర్తించి తగిన చికిత్స అందజేయడం జరుగుతుందని,దాని ద్వారా జీవిత కాలాన్ని పొడిగించుకునే అవకాశం ఉంటుందని సుఖ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగ మల్లిక, ల్యాబ్ టెక్నీషియన్ బాలాజీ రావు, ఓ ఆర్ డబ్ల్యు మల్లేశ్వరి, పి ఈ ఈ ఎస్ రుబీన, షబానా చందన తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యం

తుగ్గలి : రాష్ట్రంలోని ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ బత్తిన వెంకటరాముడు,రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు వెంకటపతి లు తెలియజేశారు.రాష్ట్ర ప్రభుత్వ, పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు మండల పరిధిలోని గల చెన్నంపల్లి గ్రామంలో మంగళవారం రోజున ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని సోమవారం రోజున తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు,నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంలో కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను వారు ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు, తల్లికి వందనం,స్త్రీ శక్తి,దీపం పథకం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్ల ప్రారంభం, పేదలకు 5 లక్షల ఇల్లు, ఎన్టీఆర్ వైద్య సేవలు, మత్స్యకారులకు సంక్షేమ నిధి వంటి వివిధ పథకాలను వారు ఇంటింటికి వెళ్లి ప్రజలకు కరపత్రాలు అందజేసి వివరించారు.అదేవిధంగా సంక్షేమ పథకాలతో పాటుగా కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులకు,గ్రామీణ రహదారులకు, రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలకు, రైతులకు రాజముద్ర తో కూడిన పాసుపుస్తకాలు, ఉచిత ఇసుక వంటి పథకాలను ప్రారంభించి అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వారు తెలియజేశారు.కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో మెగా డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు,రాష్ట్రంలో పోలీసుల ఉద్యోగాలను భర్తీ చేసిందని వారు తెలియజేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ సమన్వయంతో ఎన్నో కంపెనీలు రాష్ట్రానికి వచ్చి ఉపాధి అవకాశాన్ని కల్పిస్తున్నాయని వారు తెలియజేశారు.అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాజముద్రతో ముద్రించిన రైతుల పట్టాదారు పాసు పుస్తకాలను నాయకులు రైతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు,ఉపాధ్యక్షుడు వెంకట రాముడు చౌదరి,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మా భాష,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్, రాజేంద్ర గౌడ్, మధుబాబు,సంఘాల కృష్ణ,లక్ష్మీ నారాయణ,అక్బర్ బాషా,రామయ్య, రాము,నాగార్జున తదితర మండల టిడిపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో రెండు కొత్త బస్సు సర్వీసులను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రారంభించిన సర్వీసుల్లో ఎమ్మిగనూరు– విజయవాడ సూపర్ లగ్జరీ బస్సు మరియు ఎమ్మిగనూరు– ఆదోని పల్లెవెలుగు బస్సు ఉన్నాయి. ఏపీఆర్ఎస్ మరియు ఏపీఆర్జేసీ ఉపాధ్యాయులు, అధ్యాపకుల ప్రత్యేక విజ్ఞప్తి మేరకు ఈ సర్వీసులను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారుఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డిమాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపర చడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతులు మరియు సాధారణ ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.అలాగే ప్రజల నుంచి వచ్చే అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా కొత్త బస్సు సర్వీసులు, మెరుగైన రూట్లు, ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, టీడీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిశీలకులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్టీసీ అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బేతంచెర్ల : ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,పేర్కొన్నారు.బేతంచెర్ల పట్టణంలో ఇంటింటికి తేదేపా కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలసి హనుమాన్ నగర్,సంజీవ నగర్, కాలనీలలోఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.అలాగే మండల పరిధిలోని పపాసాని కోటల,తవిసి కొండ, హుస్సేన పురం, గ్రామలలోఎమ్మెల్యే ఇంటింటికి తెదేపా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి,మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య,బుగ్గన ప్రభాకర్ రెడ్డి,వార్డ్ కౌన్సిలర్ అంజి,టైలర్ రాముడు,మాజీ ఎంపీపి సోమశేఖర్ రెడ్డి, బండికటి వెంకటేశ్వర రెడ్డి,ఉన్నాం సుధాకర్, బీమేశ్వర రెడ్డి,గోపాల్, మద్దయ్య,బిజెపి జిల్లా కార్యదర్శి నాగ మోహన్,ఎర్రమల,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి విభాగంలో జాతీయ అవార్డు అందుకున్న రాజన్న ఫౌండేషన్

తిరుపతి : సీఎస్ఆర్ టైమ్స్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని లీ మెరిడియన్ హోటల్లో మంగళవారం నిర్వహించిన 13వ జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత పర్యావరణ, సామాజిక, సుపరిపాలన సదస్సు మరియు అవార్డులు–2026లో గ్రామీణ ఉ మౌలిక సదుపాయాల అభివృద్ధి (గ్రామాభివృద్ధి) విభాగంలో రాజన్న ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక జాతీయ అవార్డును అందుకుంది.ఈ అవార్డును రాజన్న ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరీనేని భారతదేశంలోని రొమేనియా రాయబారి సెనా లతీఫ్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ మాజీ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి భాస్కర్ ఛటర్జీ చేతుల మీదుగా అందుకున్నారు.విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధి రంగాల్లో రాజన్న ఫౌండేషన్ చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమర రాజా గ్రూప్, రాజన్న ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ శ్రీ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ, "గ్రామీణాభివృద్ధి పట్ల మా నిబద్ధతకు ఈ జాతీయ అవార్డు గుర్తింపుగా నిలిచింది. ఈ గౌరవాన్ని మా ఉద్యోగులు, భాగస్వాములు, గ్రామీణ ప్రజలకు అంకితం చేస్తున్నాం. సమగ్ర గ్రామీణాభివృద్ధి ద్వారా 'వికసిత్ భారత్?2047' లక్ష్య సాధనకు రాజన్న ఫౌండేషన్ తన సేవలను మరింత విస్తరిస్తుంది" అని అన్నారు.

# చేప పిల్లలు రెడీ..



సిరిసిల్ల : మత్స్యకారుల ఉపాధికి దోహదపడుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీ ప్రక్రియపై ఎల్‌నినో ఎఫెక్ట్‌తో ఈసారి నీలినీడలు కమ్ముకున్నాయని మత్స్యకారులు భావించారు. వానాకాలం మొదలై రెండు నెలలు గడిచినా సమృద్ధిగా వర్షాలు లేకపోవడంతో ఉచిత చేపపిల్లల పథకంపై అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో ప్రభుత్వం చేపపిల్లల సరఫరాకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మత్స్యకారుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరుతోంది. టెండర్ల ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం కావాల్సి ఉన్నా కొంత ఆలస్యంగానైనా టెండర్ ప్రక్రియ ప్రారంభించడానికి మత్స్యశాఖ కసరత్తు ప్రారంభించడంతో ఈసారి మత్స్యకారులకు ఉపాధికి ఇబ్బంది లేదని భావిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా మత్స్యశాఖ అధికారులు 2026–27 యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి రెండు మూడు రోజుల్లోనే టెండర్ ప్రక్రియ ప్రారంభించి, సెప్టెంబర్ చివరి వరకు పంపిణీ పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించారు.

**గత సంవత్సరం**

**1.35 కోట్ల చేపపిల్లల పంపిణీ**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రతి ఏటా ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత చేప పిల్లల పథకం ద్వారా చేపలను పెంచి మత్స్యకారులు జీవనోపాధిని పొందుతున్నారు. జిల్లాలో గత సంవత్సరం 348 చెరువులు, కుంటలు, శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టు, ఎగువ మానేరు ప్రాజెక్ట్, అన్నపూర్ణ ప్రాజెక్ట్, మల్కపేట ప్రాజెక్టులో 1.35 కోట్ల చేప పిల్లలను వదిలారు. నాలుగు రకాల చేప పిల్లలు ప్రధానంగా బొచ్చె, రవులు, బంగారు తీగ, మేరియా రకాల పిల్లలను వదిలారు. ఈసారి 2026–27 సంవత్సరానికి మత్స్య శాఖ రూపొందించిన యాక్షన్ ప్లాన్ ప్రకారం 1,48,45,479 చేప పిల్లలను జిల్లాలోని 456 చెరువులు, నాలుగు ప్రాజెక్టుల్లోకి వదలనున్నారు. జిల్లాలోని ప్రధాన శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్టులోకి 28.50 లక్షలు, నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి 10.50 లక్షలు, అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులోకి 1369500 లక్షలు, చెరువుల్లోకి దాదాపు 95 లక్షల చేప పిల్లలను వదిలే విధంగా లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లోకి చేప పిల్లలు పంపిణీ చేసే ముందు జిల్లా అధికారుల బృందం క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులు, చెరువులను పరిశీలించి టెండర్లను ఫైనల్ చేస్తారు. వివిధ సైజుల్లో చేప పిల్లలను సరఫరా చేయడానికి టెండర్లను ఆహ్వానిస్తారు. చేప పిల్లల సరఫరా టెండర్లపై కాంట్రాక్టర్లు గతంలో ఆసక్తి చూపకపోవడంతో పలుమార్లు టెండర్లకు ఆహ్వానించాల్సి వచ్చింది. వర్షాకాలం ఆరంభంలోనే సమృద్ధిగా వర్షాలు కురిస్తే చెరువులు, కుంటలు, ప్రాజెక్టులోకి నీరు చేరడంతోనే ఉచిత చేప పిల్లలు వదిలితే ఉత్పత్తి పెరుగుతుందని మత్స్యకారులు అంటున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో చేప పిల్లలు వేస్తే ఎదిగే అవకాశాలు తక్కువగా ఉంటాయి. చేపలు కిలో వరకు సైజు పెరగాలంటే కనీసం 6 నెలల సమయం పడుతుంది. జూలై, ఆగస్టు మాసాల్లో చెపపిల్లలను వదిలితేనే విక్రయించే అవకాశాలు ఉంటాయని మత్స్యకారులు చెప్తున్నారు.

**జిల్లాలో మత్స్య సహకార పరిస్థితి ఇది...**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మత్స్య కారులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఉపాధిని అందుకుంటున్నారు. జిల్లాలో మత్స్య శాఖ పరిధిలో 401 చెరువులు ఉన్నాయి. 168మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, 9220 మంది సభ్యులు ఉన్నారు. 48 మహిళ మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, రెండు ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం వరకు మిడ్ మానేరులో చేపలు పట్టడానికి 741 మంది మత్స్యకారులకు, ఎగువ మానేరు ప్రాజెక్టులో 251 మంది, అన్నపూర్ణ ప్రాజెక్టులో 52 మంది మత్స్యకారులకు లైసెన్సులు జారీ చేశారు.

# ప్రాజెక్టులు కళకళ



హైదరాబాద్ : కృష్ణా బేసిన్‌లోని జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఈ ప్రాజెక్టుల్లోని నీటి నిల్వలు పెరుగుతున్నాయి. అయితే, ఎగువన ఉన్న ఆల్మట్టి జలాశయానికి వరద గణనీయంగా తగ్గింది. ఆల్మట్టిలో 14,025 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా 149597 క్యూసెక్కులను దిగువకు వదిలిపెట్టారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 1,46,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1,47,776 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. తుంగ–భద్ర నదులపై ఉన్న తుంగభద్ర జలాశయానికి వచ్చే వరద క్రమంగా పెరిగింది. దీనికి 82 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. ఇక, ఆల్మట్టి నుంచి 1.50 లక్షల క్యూసెక్కులు, భీమా నది నుంచి 85 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. జూరాల జలాశయానికి 2.41 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే 2.53 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో రికార్డయింది. ఇక శ్రీశైలంలోకి భారీ ప్రవాహం (2.15 లక్షల క్యూసెక్కులు) కొనసాగుతోంది. 215.81 టీఎంసీల గరిష్ఠ నిల్వ సామర్థ్యానికి గాను మంగళవారం రాత్రి 8 గంటలకు 108.488 టీఎంసీల వరద వచ్చి చేరింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి 513.10 అడుగుల (136.9932టీఎంసీలు) నీటిమట్టం నమోదైంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా ఎగువనుంచి నీటి రాక లేదు. ఇక, గోదావరి బేసిన్‌లోని శ్రీపాద ఎల్లంపల్లికి 5,158 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంటే 12,880 క్యూసెక్కులను పంపింగ్ చేస్తూ మిడ్ మానేరుకు తరలిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 22,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ఈ ప్రాజెక్టులో 34.58 టీఎంసీల నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 7,789 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ఎగువన గోదావరిపై ఔరంగాబాద్ శివారులోని పైటన్‌లో ఉన్న జైక్వాడి ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 102.73 టీఎంసీలు కాగా 95.32 టీఎంసీల నిల్వ ఉంది. సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం)కు 3.50 లక్షల క్యూసెక్కుల వరద రాగా. దుమ్ముగూడెం(సీతమ్మసాగర్)కు 4.92 లక్షల క్యూసెక్కులు, మేడిగడ్డకు 1.74 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరింది. కాగా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 638.20 అడుగులుగా (2.82టీఎంసీలు) నమోదైంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ నది పొంగి ప్రవహిస్తోంది. వలిగొండ మండలంలోని భీమలింగం కత్వ వద్ద సంగెం–బొల్లేపల్లి వద్ద లోలెవల్ బ్రిడ్జి వద్ద మూసీ ఉధృతి వల్ల రాకపోకలు నిలిపేశారు.

**40 మండలాల్లో దంచికొట్టిన వర్షం**

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సోమవారం వర్షం దంచికొట్టింది. పలు చోట్ల సోమవారం రాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వర్షాలు కురిశాయి. 40 మండలాల్లో అయితే భారీ నుంచి అతి భారీ వర్షం కురిసింది. వర్షాల దెబ్బకు పలు చోట్ల చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కామారెడ్డి జిల్లా పిట్లంలో అత్యధికంగా 14.1, కామారెడ్డిలో 13.7, బాన్సువాడలో 13.5, మహమ్మద్‌నగర్‌లో 12.4, గాంధారిలో 10, కరీంనగర్ జిల్లా గన్నేరువరంలో 11, కొడంగల్‌లో 10.8, సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్‌లో 10.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కామారెడ్డిలో ఐదు గంటల వ్యవధిలో 182.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ దెబ్బకు సోమవారం అర్ధరాత్రి కామారెడ్డి పట్టణాన్ని వరద ముంచెత్తింది. రహదారులు, కాలనీలు జలమయం అయ్యాయి. ఆ జిల్లాలోని తాడ్వాయి, బాన్సువాడ, పిట్లం, గాంధారి, సదాశివనగర్, కామారెడ్డి మండలాల పరిధిలోని పంటలు నీటమునిగాయి. కామారెడ్డిలోని రామారెడ్డి రోడ్డులో అర్ధరాత్రి ఓ పెళ్లి బృందం బస్సు వరదలో చిక్కుకుపోయింది. పోలీసులు తాళ్ల సహాయంతో బస్సులోని ప్రయాణికులను బయటకు తీసుకువచ్చారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం రాంపల్లి కొండ తండాకు చెందిన దేవసోత్ శ్రీహరి(53) సోమవారం రాత్రి పెద్దవాగు దాటేందుకు యత్నించి గల్లంతయ్యాడు. కాగా, బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# పక్కాగా సన్నాల లెక్క..

పెద్దపల్లి : సన్నరకం వరి సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఇచ్చే బోనస్ దుర్వినియోగం కాకుండా, దళారుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ వానాకాలం సీజన్ నుంచి సన్నరకం వరి విత్తనాల కొనుగోలు దశ నుంచే రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. జిల్లాలో ఎంత విస్తీర్ణంలో సన్నరకం వరి సాగు జరుగుతుందో కచ్చితంగా గుర్తించేందుకు విత్తనాల విక్రయ సమయంలోనే డీలర్లు రైతుల వివరాలను ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలు వ్యవసాయ విస్తరణాధికారుల (ఏఈవోలు) వద్ద ఉన్న పంటల నమోదుతో పూర్తిగా సరిపోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఏ మాత్రం వ్యత్యాసం ఉన్నా బోనస్ మంజూరులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. డీలర్ల వద్ద కాకుండా గతంలో నిల్వ ఉంచుకున్న విత్తనాలతో సాగు చేసే రైతులకు కూడా అవకాశం కల్పించారు. అలాంటి రైతులు తమ పరిధిలోని ఏఈవో ద్వారా ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఈ వానా కాలం సీజన్‌లో ప్రభుత్వం నిర్దేశించిన ఏడు సన్నరకం వరి రకాలకే బోనస్ వర్తించనుంది. వాటిలో తెలంగాణ (15048), సాంబమసూరి (బీపీటీ–5204), కేఎన్ఎం–1638, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరాం, ఎల్–44, టీజీ–7715 రకాలు ఉన్నాయి. ఆయా రకాల పంట కాలాన్ని కూడా వ్యవసాయ శాఖ నిర్ధారించింది.

**రాష్ట్రంలో ఎక్కడ కొనుగోలు చేసినా నమోదు..**

రైతులు రాష్ట్రంలోని ఏ జిల్లాలో విత్తనాలు కొనుగోలు చేసినా ఆ వివరాలు సంబంధిత జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరేలా వ్యవస్థను రూపొందించారు. దీంతో సన్నరకం సాగు విస్తీర్ణంపై కచ్చితమైన సమాచారం అందుబాటులోకి రానున్నది. మండల, జిల్లా స్థాయి వ్యవసాయ అధికారులు డీలర్ల నమోదు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే కొనుగోలు చేసిన విత్తనాల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,95,000 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. ఇందులో అత్యధికంగా రైతులు సన్న రకాలనే సాగు చేస్తున్నారు. ఇందులో 1,45,000 ఎకరాల్లో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్నాలనే సాగు చేస్తున్నట్లుగా వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. అనంతరం ఏఈవోలు పంటల నమోదు సమయంలో వాటిని సరి చూసి అవసరమైన మార్పులు చేయవచ్చు.

**నమోదు లేకుంటే బోనస్ లేదు..**

ఆన్‌లైన్‌లో విత్తనాల కొనుగోలు నమోదు చేయని రైతులకు సన్న వరి బోనస్ వర్తించదని వ్యవసాయ శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. డీలర్లు సులభంగా లాగిన్ అయ్యేందుకు క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని కూడా కల్పించారు. విత్తనాల విక్రయం సమయంలో రైతు పేరు, తండ్రి పేరు, మొబైల్ నంబర్, ఆధార్ వివరాలు, విత్తన రకం, కంపెనీ పేరు, లాట్ నంబర్, ప్యాకెట్ పరిమాణం, కొనుగోలు తేదీ వంటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి. ఈ డిజిటల్ నమోదు ప్రక్రియ వానాకాలం సీజన్‌లో విక్రయించే విత్తనాలకు మాత్రమే వర్తిస్తుందని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా డీలర్లు నమోదు పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ ఆదేశించింది.

# యథేచ్ఛగా రీ ఫిల్లింగ్ దందా


జగిత్యాల : జిల్లాలోని పలు ప్రాంతాల్లో సబ్సిడీ గ్యాస్ రీ ఫిల్లింగ్ దందా జోరుగా సాగుతోంది. జనావాసాల మధ్య అక్రమ దందా నడుస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి పట్టణాల్లో, పలు మండల కేంద్రాల్లో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. పలు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, గ్యాస్ డెలివరీ బాయ్స్ అక్రమార్జనకు తెరలేపి సబ్సిడీ గ్యాస్ పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**కమర్షియల్, మినీ సిలిండర్లలోకి ఫిల్లింగ్**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తుండడంతో రీ ఫిల్లింగ్ దందా ఉధృతంగా సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్యాస్‌ను తక్కువగా వినియోగించుకునే వారిని గ్యాస్ డెలివరీ బాయ్స్, ఏజెన్సీ నిర్వాహకులు గుర్తించి వారిచే గ్యాస్ బుక్ చేయిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీని మీరే తీసుకోండి అని వినియోగదారులకు ఆఫర్ ఇచ్చి గాలం వేస్తున్నారు. దీంతో వినియోగదారులు వారి వైపు మొగ్గు చూపి గ్యాస్ బుక్ చేస్తున్నారు. ఇలా వచ్చిన గ్యాస్ సిలిండర్‌ను రీ ఫిల్లింగ్, వాణిజ్య అవసరాలకు వినియోగించుకునే వారికి డిమాండ్‌ను బట్టి రూ.1,500 వరకు విక్రయిస్తున్నారు. వీరి అక్రమాలపై నిఘా పెట్టి నియంత్రించాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమ సంపాదనకు ఆశపడి..**

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కార్మికులు, బ్యాచిలర్లు, స్థానికేతరులు, పేదలు అధికంగా ఉంటున్నారు. వీరిలో చాలా మందికి స్థానికంగా గ్యాస్ కనెక్షన్లు లేకపోవడంతో మార్కెట్‌లో సులభంగా దొరికే చిన్న సిలిండర్లను వినియోగిస్తున్నారు. చిన్న సిలిండర్ల అమ్మకందారులు సబ్సిడీ గ్యాస్‌ను తమ అక్రమ వ్యాపారానికి



వాడుతున్నారు. ప్రభుత్వం అందించే గ్యాస్ బండలో సుమారు 14.5 కిలోల వరకు గ్యాస్ ఉంటుంది. వీటి నుంచి చిన్న సిలిండర్‌లోకి రెండు, రెండున్నర కిలోల గ్యాస్ నింపి రూ.125 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. అదనంగా డబ్బులు గడించడానికి పలువురు వ్యాపారులు అక్రమ దందా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు వంద వరకు అక్రమ సిలిండర్ రీ ఫిల్లింగ్ కేంద్రాలున్నట్లు అనధికార అంచనా ఉంది. ఇక్కడ చాలా వరకు వ్యాపార కేంద్రాల్లో అన్ని వస్తువుల మాదిరిగానే చిన్న సిలిండర్ల అమ్మకాలు సాగిస్తున్నారు. సబ్సిడీ సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌లోకి గ్యాస్‌ను రీ ఫిల్లింగ్ చేయడం ప్రమాదకరమైనప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో గతంలో పలు ప్రమాదాలు జరిగినా అక్రమార్కులు సులభంగా వచ్చే ఆదాయం కోసం ఈ దందాను నడుపుతున్నారు. రీఫిల్లింగ్ కేంద్రాలు జనావాసాల మధ్య సాగుతుండడం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది.

**అంతా బహిరంగమే...**

పట్టణ, మండల కేంద్రాల్లోని పలు దుకాణాల్లో, వాహనాల్లో గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసే వారు అంతా బహిరంగంగానే ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి చిన్న సిలిండర్లను కొనుగోలు చేసి జిల్లాకు తరలించి వ్యాపారం చేస్తున్నారు. గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసే వారు ముందుగా గ్యాస్ డెలివరీ వ్యక్తులకు అడ్రస్ చెప్పి వారి వద్ద గ్యాస్‌ను డెలివరీ చేయించి ఆ తదుపరి అక్రమ దందాకు పాల్పడుతున్నారు. మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు, ఉన్నత చదువుల కోసం వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి, పట్టణ ప్రాంతాలకు వస్తున్న యువకులు, విద్యార్థులు, ఒంటరి మహిళలు, వృద్ధులు మినీ సిలిండర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారు. వీరి అవసరాలను ఆసరా చేసుకొని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబందిత శాఖ అధికారులు దృష్టి సారించి అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన అవసరముంది.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

రామడుగు : రామడుగు మండలం వన్నారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ప్రోగ్రాం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి క్లుప్తంగా వివరించారు. గర్భవతులు బాలింతలు మంచి పోషకాహారం తీసుకోవాలని పిల్లలు పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం మొదలు పెట్టాలని పిల్లలకు రెండు సంవత్సరాలు నిండే వరకు ఖచ్చితంగా తల్లిపాలు కొనసాగిస్తూ పిల్లలకు మంచి పోషక ఆహారం తినిపించాలని మర్రుపాలు తల్లిపాలలో వ్యాధినిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని తల్లులకు సూపర్వైజర్ రేణుక వివరించారు. ఆరు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు బాలా మృతం తప్పకుండా తినిపించాలని మూడు నుండి ఐదు సంవత్సరాల పిల్లలందరినీ అంగన్వాడికి ప్రీస్కూల్ కు పంపించాలని తల్లులను కోరారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వన్నారం సర్పంచ్ గుంట ఓదెలు (ఐసీడీస్)సూపర్వైజర్ పి.రేణుక స్కూల్ హెచ్ఎం స్కూల్ టీచర్ సెక్రటరీ నవిత అంగన్వాడి టీచర్లు శ్రీదేవి భారతి ఆయాలు తల్లులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి

బద్వేలు : బద్వేలు నియోజకవర్గం,అట్లూరు మండలం,అట్లూరు క్రాస్ రోడ్ లో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి ప్రజలను నేరుగా కలిసి గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరికి అయినా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. సంక్షేమం కోసం ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎక్కడా వెనకడుగు వేయడం లేదన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆదాయ వనరులు తక్కువగా ఉన్నప్పటికీ అభివృద్ధి మరియు సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి విషయంలో గతంలో ఎన్నడూ లేనంతగా గుంతలు లేని రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అలాగే అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడంతో పాటు భోగాపురం విమానాశ్రయం ప్రారంభం కూడా రాష్ట్ర అభివృద్ధికి దోహదపడిందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, అట్లూరు మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధి పట్ల ఎంఈఓ అభినందనలు

పిడుగురాళ్ల :పిడుగురాళ్ల మండల విద్యాశాఖ అధికారి ఎండి. ఖాసిం పట్టణంలోని మండల ప్రాథమిక పాఠశాల (ఎస్టీ) కాలనీ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని అందరు విద్యార్థులు ఏకరూప (యూనిఫామ్) దుస్తులు, షూస్ తో సమయపాలన పాటిస్తూ హాజరు కావడం పట్ల విద్యార్థులను అభినందించారు. పాఠశాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. ప్రసాద్ రావు, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, పాఠశాల మంచి వాతావరణం లో, మంచి మంచి సూక్తులతో, వరండా బయట కూడా మంచి బొమ్మలతో ఏర్పాటు చేయడంతో పాటు, పాఠశాలలో చక్కగా మొక్కలు నాటడం, విద్యార్థులను మంచి క్రమ శిక్షణలో పెట్టడం, దాతల సహకారంతో చక్కటి గేటు ఏర్పాటు చేయడం , ప్రధానోపాధ్యాయులు సైతం పూర్తిగా తరగతులు బోధించడం పాఠశాల అభివృద్ధికి ప్రధాన కారణమని ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుని ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పరిశీలించి, 100% విద్యార్థులు మధ్యాహ్నబడి భోజనం చేయటం పట్ల వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాఠశాలలలో వాలంటీర్ టీచర్ నియామకానికి జియో మైసూర్ సానుకూల స్పందన

తుగ్గలి :పాఠశాలల్లో నెలకొన్న ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లాలని తుగ్గలి మండల విద్యా శాఖ,స్థానిక నాయకులు సంయుక్తంగా చొరవ తీసుకున్నారు. జియో మైసూర్ కంపెనీ అధికారులు,తుగ్గలి మండల ఎంఈఓ రామా వెంకటేశ్వర్లు,పాటీల్ ఈశ్వర రెడ్డి మరియు పలువురు స్కూల్ సిబ్బంది కలిసి సమావేశమయ్యారు. సమావేశంలో సిబ్బంది కొరత ఉన్న పాఠశాలల్లో వాలంటీర్ టీచర్‌ను నియమించాలని కంపెనీ అధికారులను విన్నవించారు. ఈ ప్రతిపాదనపై జియో మైసూర్ కంపెనీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు వాలంటీర్లను నియమించేందుకు కంపెనీ తన వంతు సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ చొరవ వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విద్యా నాణ్యత మెరుగుపడటంతో పాటు, ఉపాధ్యాయుల కొరత కూడా తగ్గుతుందని ఎంఈఓ మరియు సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలోని ప్రైవేట్ సంస్థలు విద్యారంగానికి చేయూతనివ్వడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జియో మైసూర్ పిఆర్వో రాజేష్ ఉపాధ్యాయులు సుధాకర్ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయుడు చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో యాగంటి ఈశ్వరునికి కుంభాభిషేకం

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలో వరిమడులలో గల యాగంటి ఈశ్వరుడికి భక్తిశ్రద్ధలతో గ్రామ ప్రజలు కుంభాభిషేక మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. మండలంలో మంచి వర్షాలు కురవాలని,పంటలు సుభిక్షంగా పండాలని గ్రామ ప్రజలు సంకల్పించి ఈ పూజా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేద పండితులు శంకర్,సతీష్ స్వాముల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల నడుమ మహానంది పుణ్య జలాలతో శివలింగానికి కుంభాభిషేకం జరిపించారు. నిత్య భజనలతో ఓం నమశ్శి వాయ అనే నినాదాలతో దేవాలయ ప్రాంగణం మారుమోగిపోయింది. కుంబాభిషేకం అనంతరం యాగంటి ఉమామహేశ్వరునికి మహా రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నట్లు వేద పండితులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం అందరికీ అన్నదానం నిర్వహించారు. దేవుని కృపతో రైతులకు అనుకూల వర్షాలు కురిసి అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పట్టుకున్న వరంగల్ పోలీసులు

వరంగల్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల చోరీలపై సంబంధిత పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. బైక్ చోరీలు చైన్ స్నాచింగ్ కేసులకు కూడా దారి తీస్తుండటంతో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్లను నియమించామని కమిషనర్ ఎన్ శ్వేత వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో ప్రత్యేక దృష్టి సారించి నేర విచారణ చేయడం జరిగింది. గత కొద్ది కాలంగా జరిగిన నేరాలను విశ్లేషణ చేయగా, ఈ రోజు ఉదయం ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా బైక్ చోరీలకు సంబంధించి కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయని ఆమె అన్నారు. నిందితులు దొంతుల ప్రశాంత్ కుమార్ (20), దుర్గం సాయి కార్తీక్ (21), సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వాహన తనిఖీల సందర్భంగా నిందితులను అదుపులోకి తీసుకుని వారినుంచి మొత్తం 28 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నాం. వీటికి సంబంధించిన కేసులను ఆయా పోలీస్ స్టేషన్లతో అనుసంధానం చేస్తూ తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆమె వెల్లడించారు. నిందితులపై గతంలో కూడా పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన కేసులు నమోదు అయ్యాయి. స్వాధీనం చేసుకున్న వాహనాల అసలు యజమానులను గుర్తించి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం అప్పగించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇద్దరు నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసులను కమిషనర్ అభినందించారు.

# టీ కాంగ్రెస్ లో పట్టభద్రుల ఎన్నికల వేడి



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ప్రస్తుతం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల చుట్టూ తిరుగుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న కీలకమైన ఎన్నికలు కావడం, విద్యావంతులు, ఉద్యోగుల నాడిని ప్రతిబింబించే పోరు కావడంతో అధికార కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇటీవల జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశంలోనూ ఎమ్మెల్సీ ఎన్నికల సమరసన్నాహాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏదేమైనా రెండు స్థానాల్లోనూ గెలిచి తీరాల్సిందేనని, విజయం సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పార్టీ అధిష్టానం ముఖ్యనేతలకు స్పష్టమైన టార్గెట్ నిర్దేశించింది. అధికార పార్టీ తరఫున రేసులో నిలిచి ఎమ్మెల్సీగా సభలో అడుగుపెట్టేందుకు సీనియర్లు, యువ నేతలు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. పోటీకి దిగేందుకు ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో కాంగ్రెస్ అధిష్టానానికి అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారింది. మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి పట్టభద్రుల స్థానానికి ఆశావహులు భారీగా ఉన్నారు. ఇక రాజధాని నగరం పరిధిలోని ఉమ్మడి మహబూబ్‌నగర్– హైదరాబాద్–రంగారెడ్డి పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌లో గట్టి పోటీ నెలకొంది. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన సంఘాల్లో పట్టున్న పలువురు ముఖ్య నేతలు తమవంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధిగా గుర్తింపు ఉన్న హర్ష వర్ధన్ రెడ్డి విద్యావంతుల మద్దతు తనకే ఉందనే ధీమాతో ఉన్నారు. సామ రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ గా పార్టీ వాణిని బలంగా వినిపిస్తున్నారు. ఆయన టికెట్ కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు. టీ శాట్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న శివసేనా రెడ్డి యువత, విద్యావంతులలో మంచి గుర్తింపు పొందారు. ఇక యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ రెడ్డి యువజన విభాగానికి ప్రాతినిధ్యం కల్పిస్తూ రేసులో ముందంజలో ఉన్నారు. వీళ్లతో పాటు పార్టీ సీనియర్ నాయకుడు గౌరీ సతీష్ తో పాటు మన్నే జీవన్ రెడ్డి కూడా టికెట్ రేసులో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్‌కు పట్టున్న ప్రాంతం గా భావించే నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల స్థానానికి డిమాండ్ ఊహించని స్థాయిలో ఉంది. పార్టీలోని కీలక సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎక్కువమంది ఈ ప్రాంతం నుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఇక్కడ టికెట్ దక్కించుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పేరు ఈ స్థానం నుంచి ప్రముఖంగా వినిపిస్తోంది. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉద్యమ నేతగా పేరుపొందిన చనగాని దయాకర్ సైతం విద్యార్థి, నిరుద్యోగ వర్గాల మద్దతు తనకే ఉందంటూ పోటీలో నిలిచారు. స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఇందిర కూడా ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. కోర్ కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించిన అనంతరం, విజయావకాశాలు ఉన్న నేతలనే బరిలోకి దించాలని హైకమాండ్ సూచించింది. సామాజిక సమీకరణాలు, క్షేత్రస్థాయి సమీకరణాలు, ఉద్యమ నేపథ్యం, అలాగే పట్టభద్రులలో ఉన్న ప్రజాదరణ ఆధారంగా మాత్రమే అభ్యర్థులను ఖరారు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుల నిర్ణయంపైనే ప్రస్తుతం ఈ ఆశావహుల జాతకాలు ఆధారపడి ఉన్నాయి. ఎవరికి ఎమ్మెల్సీ టికెట్ వరిస్తుంది? అధిష్టానం ఎవరి వైపు మొగ్గు చూపుతుంది అనేది ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తున్న ప్రధాన అంశం!

## ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోలు

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరుగుతుండటంతో ఆర్టీసీ కొత్తగా 3 నుంచి 5 బస్ డిపోల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. డిసెంబరు నాటికి ప్రస్తుతమున్న 26 డిపోల సంఖ్యను 31కి పెంచేందుకు ముషీరాబాద్‌లో హైదరాబాద్–3, నాగారం రోడ్డులో జవహర్‌నగర్ డిపోలతో పాటు మూతబడిన రాణిగంజ్–2 డిపోను పునఃప్రారంభించనున్నారు. స్థల కేటాయింపుపై రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను కోరారు. నగరంలో ప్రస్తుతం 493 ఈవీ బస్సులు నడుస్తుండగా.. అన్ని డిపోల్లో ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటం, మరోవైపు నగర శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్ డిపోలను అందుబాటు లోకి తేనుంది. సంస్థ అవసరాలు, భవిష్యత్తు రవాణా ప్రణాళికల ను దృష్టిలో ఉంచుకుని నగరంలో కొత్తగా 3 నుంచి 5 వరకు బస్ డిపోలను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ విస్తరణ ప్రణాళికలో భాగంగా ముందస్తుగా ముషీరాబాద్‌లోని 5 ఎకరాల స్థలంలో హైదరాబాద్–3 డిపోను, నాగారం రోడ్డు లోని 5 ఎకరాల విస్తీర్ణంలో జవహర్‌నగర్ డిపోను ఏర్పాటు చేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం వేగంగా చర్యలు తీసుకుంటోంది. వీటితో పాటు గతంలో రకరకాల కారణాలతో మూతబడిన రాణిగంజ్–2 డిపోను పునరుద్ధరించి, ఆధునిక వసతులతో రీ–మోడిఫికేషన్ చేసి త్వరలోనే పునఃప్రారంభించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 26 బస్ డిపోలు కొనసాగుతుండగా.. ఈ ఏడాది డిసెంబరు నాటికి వీటి సంఖ్యను 31కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో శివారు ప్రాంతాల్లో కొత్త డిపోల ఏర్పాటుకు తగిన స్థలాలు కేటాయించాలని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లను ఆర్టీసీ అధికారులు కోరారు. శివారు ప్రాంతాల్లో డిపోలు అందుబాటులోకి వస్తే నగర శివార్ల ప్రజలకు ప్రజారవాణా మరింత సులభతరం కానుంది. ప్రస్తుతం గ్రేటర్ ఆర్టీసీ ప్రతినిత్యం సుమారు 2800 బస్సులను నడుపుతుండగా.. వాటిలో 493 ఎలక్ట్రిక్ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం హయత్ నగర్–2 డిపో నుంచి 98, హెచ్‌సీయూ డిపో నుంచి 101, కూకట్‌పల్లి డిపో నుంచి 20, మియాపూర్–2 డిపో నుంచి 100, కంటోన్మెంట్ డిపో నుంచి 80, రాణిగంజ్ డిపో నుంచి 75 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌ను పూర్తిస్థాయి ఈవీ జోన్‌గా మార్చాలనే లక్ష్యంతో ప్రస్తుతం ఉన్న 26 డిపోలలోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లోని ప్రతి డిపోలో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

## స్టేడియం నుంచి 2 నుంచి 3 కోట్ల లీటర్లు

హైదరాబాద్ : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించేందుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. స్టేడియంలో వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)కి తెలిపింది. ఈ వ్యవస్థ అమల్లోకి వస్తే ప్రతి ఏడాది 2 నుంచి 3 కోట్ల లీటర్ల వరకు వర్షపు నీటిని సేకరించి వినియోగించే అవకాశం ఉందని వెల్లడించింది. పిచ్ నిర్వహణ కోసం భూగర్భ జలాలను అధికంగా వినియోగిస్తున్నారంటూ దాఖలైన కేసులో భాగంగా హెచ్‌సీఏ జూలై 2న ఎన్‌జీటీకి స్టేటస్ రిపోర్ట్ సమర్పించింది. కొత్త రైన్‌వాటర్ హార్వెస్టింగ్, ఫిల్ట్రేషన్ వ్యవస్థ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు తీసుకుని పనులు పూర్తి చేసేందుకు కొంత గడువు ఇవ్వాలని, అప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని ట్రైబ్యునల్‌ను కోరింది. హెచ్‌సీఏ పరిశీలిస్తున్న ప్రతిపాదన ప్రకారం.. స్టేడియంలో పడే వర్షపు నీటిని సేకరించి శుద్ధి చేసి మైదానం నిర్వహణ, తోటల సాగు, ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. అదనంగా భూగర్భ జలాలను రీచార్జ్ చేసే విధంగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్టేడియాన్ని వాటర్ పాజిటివ్‌గా మార్చే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు హెచ్‌సీఏ తెలిపింది. వర్షపు నీటితో పాటు మురుగునీటిని శుద్ధి చేసి మైదానం, పచ్చదనం నిర్వహణ కోసం వినియోగించే అవకాశాలను కూడా హెచ్‌సీఏ పరిశీలిస్తోంది. దీంతో భూగర్భ జలాల వినియోగం మరింత తగ్గుతుందని పేర్కొంది. ప్రస్తుతం ఉప్పల్ స్టేడియంలో మొత్తం 8.2 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే మూడు ట్యాంకులు ఉన్నాయి. గేట్ నంబర్–5 సమీపంలో 3.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఒక ట్యాంకు ప్రజా అవసరాల కోసం వినియోగిస్తుండగా, 2.2 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకును అగ్నిమాపక అత్యవసర అవసరాల కోసం కేటాయించారు. గేట్ నంబర్–3 వద్ద 2.5 లక్షల లీటర్ల సామర్థ్యంతో మరో ట్యాంకు సాధారణ కార్యకలాపాల కోసం ఉపయోగిస్తున్నారు.

# మళ్లీ తెరపైకి కావేరి అంశం




బెంగళూరు: ఈ సమస్య ఇప్పటిది కాదు. దశాబ్దాలు నాటిది. ఇంతవరకు పరిష్కార మార్గం దొరకలేదు. పరిష్కరించే బాధ్యత ఎవరూ తీసుకోలేదు.. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చేసుకున్నారు. అందువల్లే ఈ సమస్య మళ్లీ రిపీట్ అయింది. ఈసారి రాచపుండు మాదిరిగా ఇబ్బంది పెడుతోంది. రెండు రాష్ట్రాల మధ్య ఇబ్బంది కరమైన వాతావరణానికి కారణమవుతోంది. దక్షిణాది రాష్ట్రాలలో ప్రముఖమైనవి తమిళనాడు, కర్ణాటక. ఈ రెండు రాష్ట్రాల మధ్య కావేరి నదీ జలాల వివాదం చాలా సంవత్సరాలుగా కొనసాగుతోంది. ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. తమిళనాడులో కూడా కాంగ్రెస్ పార్టీ సపోర్ట్ తో విజయ్ ప్రభుత్వానికి కొనసాగిస్తున్నారు. కావేరి జలాల వివాదం నేపథ్యంలో ఈ రెండు రాష్ట్రాల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ వివాదం కాంగ్రెస్ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారిపోయింది. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. తమిళనాడులో అధికార పార్టీకి సపోర్ట్ చేస్తోంది. రెండు రాష్ట్రాలలో నాయకులకు బలమైన సెంటిమెంట్లను కాంగ్రెస్ పార్టీకి ఏం చేయాలో అర్థం కావడం లేదు . ఇందులో ఏమాత్రం పొరపాటు జరిగినా సరే కాంగ్రెస్ పార్టీ దుకాణం సర్దుకోవాల్సిందే .ఇటీవల రివర్ రెగ్యులేషన్ కమిటీ కీలక ఆదేశాలు జారీ చేసింది. దాని ప్రకారం తమిళనాడు రాష్ట్రానికి రోజు 3500 క్యూసెక్కుల కావేరి నది నీటిని విడుదల చేయాలి. ఈ ఆదేశాలు రావడమే ఆలస్యం కర్ణాటకలో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. వర్షాలు లేకపోవడంతో సరిగ్గా నీటి నిల్వలేదని.. ఇలాంటి సమయంలో నీరు విడుదల చేయడం కష్టమని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే క్లారిటీ ఇచ్చారు. అయితే పరిస్థితి చేయి దాటిపోతున్న నేపథ్యంలో నేరుగా కర్ణాటక వచ్చి శివకుమార్ తో మాట్లాడాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నిర్ణయించారు. అయితే కర్ణాటక రాష్ట్రంలో అక్కడి ప్రజలు.. ఇతర సంఘాల నుంచి తిరుగుబాటు విపరీతంగా ఉండడంతో విజయ్ పర్యటనను రద్దు చేసుకోవాలని శివకుమార్ సూచించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కర్ణాటక రాష్ట్రానికి అసలు రావద్దని శివకుమార్ విజయ్ కి సూచించారు. తమిళనాడు రాజకీయాలను కావేరి నది నీటిని వేరుగా చూడడం సాధ్యం కాదు . కావేరి నది నీటి ఆధారంగానే తమిళనాడు రైతులు పంటలు సాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కర్ణాటక ఒత్తిడికి తలవంచితే విజయ్ కి తమిళనాడు రాష్ట్రంలో ఇబ్బందికరమైన పరిణామం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలోనే విజయ్ ప్రభుత్వం కావేరి నది జలాల వ్యవహారాన్ని సుప్రీంకోర్టులో తేల్చుకోవాలని భావించింది. మరోవైపు విజయ్ క్యాబినెట్ లో ఉన్న చాలామంది మంత్రులు కర్ణాటక ముఖ్యమంత్రి మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నారు. కావేరి నది నీళ్లు విడుదల చేయకపోతే.. విజయ్ తన ప్రభుత్వానికి సంబంధించి కాంగ్రెస్ ఇచ్చిన సపోర్ట్ పై ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అక్కడ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తమిళనాడు మంకుపట్టు వీడకపోవడం.. కర్ణాటక ప్రభుత్వం పట్టుదలతో ఉండడంతో కావేరి వివాదం కాంగ్రెస్ పార్టీకి చాలా ఇబ్బందికరంగా మారింది. కర్ణాటక ముఖ్యమంత్రి పై స్థానిక రైతులు.. బిజెపి.. జెడిఎస్ పార్టీల నుంచి ఒత్తిడి వస్తోంది. ఒకవేళ కర్ణాటక రాష్ట్రం నుంచి తమిళనాడుకు కావేరి నది జలాలు విడుదల చేస్తే మాత్రం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తుడిచి పెట్టుకోపోయే ప్రమాదం ఉంది. అందువల్లే ఓటు బ్యాంకు ను కాపాడుకోవడానికి.. బిజెపి వేసిన ఉచ్చు నుంచి రక్షించుకోవడానికి కాంగ్రెస్ పార్టీ అనేక రకాల ప్రయత్నాలు చేస్తుంది. దీనికి తోడు ఇటీవల శివకుమార్ ఆధ్వర్యంలో తమిళనాడు ప్రభుత్వం ప్రతిపాదించిన మేకదాటు ప్రాజెక్టును ఏకపక్షంగా వ్యతిరేకించారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య వివాదం మరింత పెరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ప్రాంతీయ సెంటిమెంట్లు అధికంగా ఉంటాయి.. ఈ సెంటిమెంట్లకు రెస్పెక్ట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీ పుట్టి కావేరిలో మునగడం ఖాయం.

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌ల మధ్య క్షుద్ర పూజల పంచాయితీ

హైదరాబాద్ : నేటి కాలంలో కూడా బ్లాక్ మ్యాజిక్ నమ్ముతారా.. ఏవో శక్తులు ఉన్నాయంటే విశ్వసించాలా.. నిజంగానే.. దయ్యాలు.. ఉన్నాయా.. ఉంటే వాటికి పూజలు చేసి వశం చేసుకోవచ్చా.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రస్తుతం పరిణామాలు దయ్యాలు.. క్షుద్ర పూజల చుట్టూ తిరుగుతున్నాయి.. ప్రస్తుతం మనం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో ఉన్నాం. అరచేతులలో ప్రపంచం మొత్తాన్ని సులువుగా చూడగలుగుతున్నాం. ఏం జరిగిందో వెంటనే తెలుసుకోగలుగుతున్నాం. ఏం జరుగుతుందో కూడా అంచనా వేయగలుగుతున్నాం. ఇటువంటి కాలంలో క్షుద్ర పూజలు చేయడం ఏంటి.. ఎదుటివారి కీడును కోరుకునేందుకు పూజలు చేయడమేంటి.. వీటి ద్వారా అవన్నీ జరుగుతాయా.. అసలు అవన్నీ సాధ్యమేనాఇటీవల భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు పుణ్యక్షేత్రాలను సందర్శించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా.. ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రఖ్యాతమైన క్షేత్రాలను ఆయన సందర్శించారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఈ క్షేత్రాలను సందర్శించడం వెనక కారణం వేరే ఉందని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.. ముఖ్యంగా చిత్ర పూజలు చేయడానికి హరీష్ రావు వేరే ప్రాంతాలలో ఉన్న క్షేత్రాలను సందర్శించారని.. అక్కడ క్షుద్ర పూజలు కూడా చేశారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఏకంగా విలేకరుల ముందుకు వచ్చి హరీష్ రావును తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను చూసి ఓర్వలేక క్షుద్ర పూజలు చేశారని ఆరోపించారు. భారత రాష్ట్ర సమితి నాయకులకు క్షుద్ర పూజలు చేయడం అలవాటేనని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లింది.. ఎవరిని కలిసింది.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి ఏ తరహాలో వ్యవహరించింది అంతా తెలుసని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మరోవైపు హరీష్ రావు మీద చేస్తున్న ఆరోపణల పట్ల ఆయన వర్గం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులకు మతిభ్రమించిందని.. ప్రజలకు ఎటువంటి మంచి పనులు చేయకపోగా.. డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని హరీష్ వర్గం నాయకులు మండిపడుతున్నారు. ఇప్పటికే కాంగ్రెస్ నాయకులు మీద హరీష్ రావు లీగల్ నోటీసులు ఇచ్చారు. తాను క్షుద్ర పూజలు చేశానని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నాయకులు క్షమాపణ చెప్పాలని.. లేకపోతే పరువు నష్టం దావా ఎదుర్కోవాల్సి ఉంటుందని హరీష్ రావు ఆ నోటీసులలో పేర్కొన్నారు. ఇటీవల కుటుంబంతో కలిసి హరీష్ రావు వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అయితే ఆ పుణ్యక్షేత్రాల సందర్శన వెనక క్షుద్ర పూజలు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. హరీష్ రావు ఎన్ని రకాల పూజలు చేసినప్పటికీ గెలిచేది కాంగ్రెస్ పార్టీనేనని.. మళ్లీ కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని హస్తం నేతలు స్పష్టం చేస్తున్నారు.

## తెలంగాణకు ప్రాజెక్టులు ఇచ్చినా.. కనిపించని ఫలితం

హైదరాబాద్ : ఏపీలోని విజయనగరం జిల్లాలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ అదే వేదిక నుంచి మరిన్ని ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. వీటిలో తెలంగాణలోకి ఖమ్మం, దేవరపల్లి ప్రాంతాలకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. అ యితే.. వీటిని ప్రస్తావిస్తూ.. తెలంగాణ బీజేపీ నాయకులు ఎక్కడా ప్రకటన చేయకపోవడం.. కనీసం కార్యక్రమాన్ని కూడా నిర్వహించకపోవడం గమనార్హం. నిజానికి ఏపీలో ప్రారంభించిన పలు ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందినవి.. అనుబంధంగాఉన్న ప్రాజెక్టులు కొన్ని ఉన్నాయి. కానీ, ఆ తరహా జోష్ తెలంగాణలో కనిపించకపోవడం గమనార్హంమోడీ ప్రారంభించిన వాటిలో.. కీలకమైన తెలంగాణ ప్రాజక్టుల విషయానికి వస్తే.. ఖమ్మం–దేవరపల్లి మధ్య ప్రధాన ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం కోసం.. కొన్నేళ్లుగా ఇక్కడివారు ఎదురు చూస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రభుత్వం కూడా విజ్ఞాపలు సమర్పించింది. ఈ నేపథ్యంలోనే 'ఖమ్మం –దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఫోర్ లేన్స్ ఎక్స్‌ప్రెస్‌వే'ను కేంద్రం మంజూరు చేసింది. దీనిని తాజాగా ప్రధాని ప్రారంభించారు. అలాగే ఖమ్మం –దేవరపల్లి ప్యాకేజీలో భాగంగా.. ఎక్స్ ప్రెస్ వే పక్కన గ్రామీణ రహదారులను కూడా ప్రధాని ప్రారంభించారు. వీటిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు.. సీఎం రేవంత్ రెడ్డి కలల ప్రాజెక్టు అయిన.. ఫ్యూచర్ సిటీతోనూ అనుసంధానం చేయనున్నారు. మరి ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రారంభించిన సమయంలో తెలంగాణలో ఒక్క కార్యక్రమాన్ని కూడా బీజేపీ నాయకులు ఏర్పాటు చేయక పోవడం గమనార్హం. ఇక, ఏపీలో నిర్మించిన.. అనంతపురం, కర్నూలు సౌర విద్యుత్ జోన్ల ట్రాన్స్ మిషన్ పథకాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. అయితే.. ఈరెండు జోన్ల ద్వారా.. కేవలం ఏపీలోని అనంతపురం,కర్నూలు ప్రాంతాలకే కాకుండా.. తెలంగాణలోని అనుబంధ జిల్లాలకు కూడా సౌర విద్యుత్‌ను అందించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. తెలంగాణలో బీజేపీలో ఎక్కడా చలనం లేకపోవడం గమనార్హం.

# దిగ్గజ దర్శకులకు రాజమౌళి 'బస్తీ మే సవాల్':

తెలుగు సినిమా సామర్థ్యాన్ని ప్రపంచ నలుమూలలకూ చాటిచెప్పిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి వేసే ప్రతి అడుగు ఇప్పుడు సినీ ప్రపంచంలో తీవ్ర చర్చనీయాంశమవుతోంది. RRRతో ఆస్కార్ వేదికపై సత్తా చాటడమే కాకుండా.. ఆయన తన తదుపరి చిత్రం –వారణాసి–తో సరిహద్దులు చెరిపేస్తే ప్రపంచవ్యాప్తంగా ఉన్న చాలా భాషలలో సినిమాని రిలీజ్ చేయాలనే సంకల్పంతో భారీ ప్రణాళికల్ని రూపొందించుకున్న సంగతి తెలిసిందే. అయితే విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. RRR – వారణాసి చిత్రాలు కేవలం జక్కన్న ప్రయాణంలో ఆరంభం మాత్రమే! ఒకవేళ ఇవి కేవలం ఆరంభమే అయితే.. రాజమౌళి తదుపరి ప్రాజెక్టుల కోసం ఎలాంటి విస్ఫోటనం ప్లాన్ చేస్తుండవచ్చనేది ఊహకందని విషయం.రాజమౌళి విసురుతున్న ఈ గ్లోబల్ ఛాలెంజ్ కేవలం భారతీయ దర్శకులకే పరిమితం కావడం లేదు. రామాయణం ఆధారంగా భారీ బడ్జెట్‌తో సినిమా తెరకెక్కిస్తున్న నితీష్ తివారీ లేదా మైండ్ బెండింగ్ సైన్స్ ఫిక్షన్, ప్రయోగాత్మక సినిమాలతో ప్రపంచాన్ని రక్తి కట్టిస్తున్న క్రిస్టోఫర్ నోలాన్ లాంటి హాలీవుడ్ దిగ్గజాలకే జక్కన్న సవాల్ విసురుతున్నారా అనిపిస్తోంది. భారతీయ పౌరాణిక ఇతిహాసాలను, భావోద్వేగాలను హాలీవుడ్ స్థాయి టెక్నికల్ స్టాండర్డ్స్‌కు జోడించి.. అంతర్జాతీయంగా మార్వెల్, డీసీ వంటి అతిపెద్ద హాలీవుడ్ ఫ్రాంచైజీలకు సవాల్ విసిరే ధైర్యం, దమ్ము ఒకే ఒక్క రాజమౌళికి మాత్రమే ఉన్నాయని ఇప్పుడు అభిమానులు, సినీ విశ్లేషకులు బలంగా నమ్ముతున్నారు. అతడి భవిష్యత్ ప్రణాళికల గురించి ఒక్కో లీకు సర్వత్రా ఉత్కంఠను పెంచుతున్నాయి. మరోవైపు రాజమౌళి సృష్టిస్తున్న ఈ రికార్డులను అందుకోవడానికి బాలీవుడ్ ప్రముఖులు సైతం శ్రమిస్తున్నారు. లవ్ అండ్ వార్ లాంటి భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో మళ్ళీ టాప్ లీగ్ డైరెక్టర్ల రేస్‌లోకి రావాలని సంజయ్ లీలా భన్సాలీ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ప్రతి కథలో లాజిక్, కంటెంట్, వినోదాన్ని సమపాళ్ళలో అందిస్తూ వరుస బ్లాక్‌బస్టర్లను ఇచ్చే రాజ్ కుమార్ హిరాణీ వంటి లాజికల్ దర్శకులు కూడా రాజమౌళి సవాల్‌ను స్వీకరించి ఈ గ్లోబల్ రేసులో నిలబడతారేమో చూడాల్సి ఉంది. ఈ దిగ్గజాల సమరంలో సరికొత్త శకానికి ఊపిరి



పోస్తూ దక్షిణాదికి చెందిన యువ దర్శకులు కూడా రేసులో సుకుమార్ కూడా ఉన్నారు. పుష్ప, పుష్ప 2 చిత్రాలతో సంచలనాలు సృష్టించిన సుకుమార్ తన తదుపరి సినిమాలను గ్లోబల్ రేంజులో తెరకెక్కించాలనే సన్నాహకాల్లో ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇది కచ్చితంగా కాంపిటీషన్ లో నిలవడంగానే చూడాలి. ఇక తమిళ పరిశ్రమ నుంచి మాస్ పల్స్ తెలిసిన అట్లీ ... లోకేష్ సినిమాటిక్ యూనివర్స్ పేరుతో సరికొత్త లీగ్ సృష్టించిన లోకేష్ కనగరాజ్ వంటి యువ సంచలనాలు ప్రస్తుతం విపరీతమైన క్రేజ్‌తో ఉన్నారు. కమర్షియల్ ఎలిమెంట్స్‌ని గ్లోబల్ స్టాండర్డ్స్‌కు తగ్గట్టు మలచడంలో వీరు కూడా సిద్ధంగా ఉన్నారు. ప్రస్తుతం ఉన్న తమ మార్కెట్ స్థాయిని రాజమౌళి చూపిస్తున్న బాటలో నడుస్తూ గ్లోబల్ రేంజ్‌కు చేర్చగల సమర్థత ఈ యువ దర్శకులకు కచ్చితంగా ఉంది. భారతదేశం నుంచి ప్రపంచ సినిమాను శాసించే దర్శకులలో రాజమౌళి లీడ్‌లో ఉన్నా.. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో మిగిలిన దర్శకులు కూడా గ్లోబల్ రేసులో పోటీ పడటం భారతీయ సినిమాకు లభించిన గొప్ప అవకాశంగా చెప్పవచ్చు. ఇది ఆరంభం మాత్రమేనని రాజమౌళి అన్నారు! అంటే, కచ్చితంగా ఆయన నుంచి డీసీ, మార్వెల్ రేంజ్ సినిమాలను ప్రజలు ఆశించవచ్చు.

# 41 గంటలు నిర్విరామంగా షూటింగ్ లోనే కీర్తి సురేష్!



భారతీయ చలన చిత్ర పరిశ్రమలో పని గంటల వివాదం ఎంత సంచలనమైందో తెలిసిందే. సెట్ లో 8 గంటలు మించి పని చేయించుకోవడంపై చాలా మంది హీరోయిన్లు బాహాటంగా విమర్శలు చేసారు. పనికి తగ్గ పారితోషికం ఇవ్వడం లేదని..అలాంటప్పుడు ఎందుకు? పని చేయాలని మరికొంత మంది నటీమణులు తెరపైకి వచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కీర్తి సురేష్ ఏకంగా 41 గంటల పాటు నిర్విరామంగా పనిచేసి పని తనకు భారం కాదని నిరూపించారు. వివరాల్లోకి వెళ్తే..ఒకే సమయంలో పలు చిత్రాల షూటింగ్‌లతో బిజీగా ఉండటం వల్ల తాను పడిన కష్టాలను గుర్తుచేసుకుంటూ కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీవలి కాలంలో విభిన్న భాషల్లో ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్న కీర్తి సురేష్ డేట్స్ సర్దుబాటు చేయడం కోసం ఎంతగా శ్రమించాల్సి వస్తుందో వివరించారు. ముఖ్యంగా ఒక పెద్ద ప్రాజెక్ట్ షూటింగ్ నుండి నేరుగా మరో సినిమా సెట్స్‌కు పరిగెత్తాల్సిన పరిస్థితుల్లో విశ్రాంతి లేకుండా పనిచేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలో ఏకంగా 41 గంటలపాటు ఎలాంటి నిద్ర లేకుండా మెలకువగానే ఉంటూ షూటింగ్‌లలో పాల్గొన్నానని సంచలన నిజం బయటపెట్టారు. చాలా సందర్భాల్లో సెట్ లో 12 గంటలకు మించి పనిచేసిన సందర్భాలున్నాయన్నారు. సినిమా పరిశ్రమ బయట నుంచి చూసే వారికి గ్లామర్‌గా కనిపిస్తుందని కానీ తెర వెనుక నటీనటులు పడే శ్రమ, పడే మానసిక , శారీరక ఒత్తిడి చాలా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. నిరంతరం ప్రయాణాలు చేస్తూ రాత్రింబవళ్లు తేడా లేకుండా పనిచేయడం వల్ల ఒక్కోసారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని తెలిపారు. అయినప్పటికీ వృత్తిపై ఉన్న అంకితభావంతోనే ఇన్ని కష్టాలను ఎదుర్కొని ముందుకు సాగుతున్నట్లు కీర్తి పేర్కొన్నారు. ప్రస్తుతం టాలీవుడ్ .. ఇతర ఇండస్ట్రీలలో నటీనటులు, సాంకేతిక నిపుణుల కోసం 8 గంటల పని గంటల నిబంధనను తీసుకురావాలనే డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై సినీ ప్రముఖులు భిన్న వాదనలు వినిపిస్తున్న వేళ కీర్తి సురేష్ అనుభవం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఓవర్ టైమ్ పని చేయడం వల్ల కలిగే అలసట నటీనటుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందనే చర్చకు ఇది మరింత బలాన్ని చేకూరుస్తోంది. ఎన్నో అద్భుతమైన పాత్రలతో జాతీయ స్థాయి అవార్డులను అందుకున్న నటిగా తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కీర్తి సురేష్ ఈ స్థాయికి చేరుకోవడానికి ఎంతటి కఠినమైన శ్రమను దాటివచ్చారో? ఈ ఉదంతం తెలియజేస్తోంది. విజయాలు మాత్రమే కాకుండా వెనుక నటీనటులు పడే త్యాగాలు కూడా ఎక్కువేనని అభిమానులు సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేస్తున్నారు. సినిమా రంగంలో పని గంటల సంస్కరణలు .. నటీనటుల పనితీరుపై జరుగుతున్న చర్చల మధ్య కీర్తి సురేష్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాబోయే రోజుల్లో చిత్ర పరిశ్రమ వర్కింగ్ అవర్స్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? నటీనటుల ఆరోగ్య భద్రతకు ఏ విధంగా ప్రాధాన్యత ఇస్తుందనేది వేచి చూడాలి.

# హీరో కాదు.. బ్రాండ్‌గా మారుతున్న కిరణ్ అబ్బవరం




కిరణ్ అబ్బవరం కెరీర్‌ను గమనిస్తే ఇటీవల ఓ ఇంట్రెస్టింగ్ ట్రెండ్ కనిపిస్తోంది. ఆతని సినిమాల సంఖ్య కంటే ప్రాజెక్ట్ సెలెక్షన్ స్ట్రాటజీపై ఇండస్ట్రీలో ఎక్కువ డిస్కషన్ జరుగుతోంది. ముఖ్యంగా వరుసగా కొత్త డైరెక్టర్ లతో సినిమాలు చేయడం, ఒకేసారి సినిమా, వెబ్ సిరీస్, అలాగే దర్శకత్వ బాధ్యతలను కూడా తీసుకోవడం ద్వారా తన కెరీర్‌ను కేవలం హీరోగా కాకుండా ఒక క్రియేటివ్ బ్రాండ్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్టుగా కనిపిస్తోంది. సాధారణంగా వరుస సక్సెస్‌ల తర్వాత చాలా మంది హీరోలు సేఫ్ జోన్‌లోకి వెళ్లి, ఆల్రెడీ పేరు తెచ్చుకున్న డైరెక్టర్లతో వర్క్ చేయడానికి ఆసక్తి చూపిస్తారు. కానీ కిరణ్ అబ్బవరం మాత్రం కొత్త కథలు, కొత్త డైరెక్టర్లు, కొత్త ఫార్మాట్ల వైపు అడుగులు వేస్తుండటం భిన్నమైన స్ట్రాటజీగా మారింది. ఇది కమర్షియల్‌గా రిస్క్ అయినప్పటికీ, లాంగ్ టర్మ్ కెరీర్ బిల్డింగ్ పరంగా చూస్తే ఒక స్పష్టమైన ప్లాన్ ఉన్నట్టు కనిపిస్తోంది. చెన్నై లవ్ స్టోరీ సక్సెస్ తర్వాత స్వీయ దర్శకత్వంలో సినిమా చేస్తున్న కిరణ్, తాజాగా మరో కొత్త డైరెక్టర్ కు అవకాశమిచ్చినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఒకేసారి సినిమా షూటింగ్, వెబ్ సిరీస్ కమిట్‌మెంట్స్, అలాగే దర్శకత్వ పనులను బ్యాలెన్స్ చేస్తున్న తీరు కూడా గమనించదగ్గ అంశం. ఈ మల్టీటాస్కింగ్ విధానం కేవలం బిజీ షెడ్యూల్‌కు పరిమితం కాదు. థియేటర్ ఆడియన్స్ తో పాటూ ఓటీటీ ఆడియన్స్ ను కూడా చేరుకోవడం, క్రియేటివ్ కంట్రోల్ ను పెంచుకోవడం, ఫ్యూచర్ లో తన బ్రాండ్‌ను విస్తరించడం వంటి అంశాలు ఇందులో భాగంగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కొత్త డైరెక్టర్లకు అవకాశాలు ఇవ్వడం కూడా మరో ఇంట్రెస్టింగ్ అంశం. ఇటీవల టాలీవుడ్‌లో చాలా మంది యంగ్ డైరెక్టర్లు కొత్త కథలతో ముందుకు వస్తున్నారు. అయితే వారికి గుర్తింపు ఉన్న హీరోల సపోర్ట్ లభిస్తేనే ఆ ప్రాజెక్టులు వేగంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కొత్త టాలెంట్‌తో పనిచేయడానికి కిరణ్ చూపిస్తున్న ఆసక్తి, ఇండస్ట్రీలో క్రియేటివ్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసే దిశగా కూడా చూడవచ్చు. అయితే ఈ స్ట్రాటజీలో ఛాలెంజెస్ కూడా తక్కువేమీ కాదు. కొత్త డైరెక్టర్లతో పని చేయడం అంటే స్క్రిప్ట్ డెవలప్‌మెంట్ నుంచి ఎగ్జిక్యూషన్ వరకు అనేక అనిశ్చితులు ఉంటాయి. అదే సమయంలో ఒకేసారి పలు ప్రాజెక్టులను నిర్వహించడం వల్ల వర్క్‌లోడ్, టైమ్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ వంటి అంశాలు కీలకంగా మారతాయి. అయినా, కిరణ్ అబ్బవరం ప్రస్తుతం తీసుకుంటున్న డెసిషన్స్ చూస్తే ఆయన టార్గెట్ కేవలం వరుస సినిమాలు చేయడం కాదని, కొత్త డైరెక్టర్లకు అవకాశమిస్తూ, మంచి కథలను ఆడియన్స్ వద్దకు తీసుకెళ్లే దిశగా, థియేటర్– ఓటీటీ రెండింటిలోనూ గుర్తింపు ఉన్న నటుడిగా, అవసరమైతే డైరెక్టర్ గానూ తన గుర్తింపును విస్తరించే మల్టీ డైమెన్షనల్ కెరీర్‌ను నిర్మించుకోవడమే అనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముమ్మందు ఈ ధోరణే ఆయనను ఇతర యంగ్ హీరోల నుంచి వేరు చేసే ప్రధాన అంశంగా మారే అవకాశం ఉంది.

# సూర్య మనసు దోచుకున్న తెలుగు సినిమా ఇదే



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తనకు అత్యంత ప్రభావం చూపిన సినిమాల గురించి మాట్లాడిన సందర్భంలో తెలుగు సినిమా ప్రస్తావన రావడం సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఆసక్తికరమైన డిస్కషన్ కు దారితీసింది. ముఖ్యంగా రాజమౌళి రూపొందించిన ఈగ సినిమాను ఆయన ప్రత్యేకంగా గుర్తుచేసుకోవడం, ఒక స్టార్ హీరో మరో ఇండస్ట్రీ సినిమాను ఓపెన్ గా ప్రశంసించడం ఎంత ప్రాధాన్యం కలిగి ఉందనే ప్రశ్నను మళ్లీ ముందుకు తీసుకొచ్చింది. ఒకప్పుడు తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ సినీ ఇండస్ట్రీలు ప్రధానంగా తమ తమ మార్కెట్లకే పరిమితమయ్యేవి. కానీ గత దశాబ్దంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఒక భాషలో వచ్చిన సినిమా మరో భాష ప్రేక్షకులను మాత్రమే కాదు, ఆ ఇండస్ట్రీలోని ప్రముఖ నటులు, డైరెక్టర్లను కూడా ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది. అలాంటి మార్పుకు ఈగ వంటి ఎక్స్‌పెరిమెంటల్ ఫిల్మ్స్ మైల్ స్టోన్స్‌గా భావించబడుతున్నాయి. సాధారణంగా స్టార్ హీరోలు ఇంటర్వ్యూల్లో తమ సినిమాల ప్రమోషన్స్‌పైనే ఎక్కువగా మాట్లాడుతుంటారు. అయితే మరో ఇండస్ట్రీకి చెందిన సినిమాను ప్రస్తావిస్తూ దాని క్రియేటివిటీ, స్క్రీన్ ప్లే, మేకింగ్ గురించి ప్రశంసించడం ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన పోటీ వాతావరణానికి సంకేతంగా కనిపిస్తోంది. ఇది కేవలం మర్యాదపూర్వక వ్యాఖ్యగా కాకుండా, మంచి కథ ఎక్కడి నుంచైనా రావొచ్చనే అంగీకారంగా కూడా చూడవచ్చు. ఈ ధోరణి ప్రేక్షకుల దృష్టికోణాన్ని కూడా మార్చుతోంది. ఇప్పుడు ఫ్యాన్స్ కూడా హీరోల మధ్య పోటీ కంటే, మంచి సినిమాల మధ్య పోలికలను ఎక్కువగా డిస్కస్ చేస్తున్నారు. సోషల్ మీడియా, పాన్ ఇండియా రిలీజ్‌లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల విస్తరణ కారణంగా భాషల మధ్య ఉన్న గోడలు గణనీయంగా తగ్గిపోయాయి. ఒక తమిళ స్టార్ తెలుగు సినిమాను మెచ్చుకోవడం, తెలుగు ఆడియన్స్ దాన్ని స్వాగతించడం ఈ మార్పుకు నిదర్శనం. ఇలాంటి ప్రశంసలు ఫ్యూచర్ లో మరిన్ని క్రాస్ ఇండస్ట్రీ కోఆర్డినేషన్స్ కు కూడా దారితీయొచ్చు. యాక్టర్లు, డైరెక్టర్లు, టెక్నికల్ టీమ్ భాషలకతీతంగా కలిసి పనిచేసే అవకాశాలు పెరుగుతున్నాయి. పాన్ ఇండియా సినిమా ఇప్పుడు కేవలం మార్కెటింగ్ మాత్రమే కాదు, పరస్పర గౌరవం, సృజనాత్మక మార్పిడి, కథలకు సరిహద్దులు లేవనే భావనకు ప్రతీకగా మారుతోంది. అందుకే ఒక స్టార్ హీరో మరో ఇండస్ట్రీ సినిమాను బహిరంగంగా మెచ్చుకోవడం అనేది వ్యక్తిగత అభిరుచిని వెల్లడించడం మాత్రమే కాకుండా భారతీయ సినిమా మరింత సమగ్రంగా, పరస్పర ప్రభావంతో ముందుకు సాగుతోందనే సంకేతంగా కూడా భావించవచ్చు.




# ఏపీలో డిప్లమెటిక్ పాలిటిక్స్

విజయవాడ : రాజకీయాల్లో నాయకులకు వ్యక్తిగత అహం, సిద్ధాంత భేషజాలు ఉండటం సాధారణం. అయితే, ప్రజాస్వామ్యంలో అధికారం దక్కినప్పుడు వ్యక్తిగత ఆత్మగౌరవం కంటే తన్ను నమ్మి ఓటేసిన కోట్ల మంది ప్రజల ప్రయోజనాలు, రాష్ట్ర పునరుద్ధరణే ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలనా శైలి ద్వారా స్పష్టం చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఆయన పదే పదే ప్రశంసించడం, వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో మోదీ నాయకత్వాన్ని బలపరచడంపై రాజకీయ ప్రత్యర్థులు, నెటిజన్లలో కొంత మంది విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ.. ఆ విమర్శలను ఏమాత్రం లెక్కచేయకుండా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. పైకి కనిపించే ఈ ప్రశంసలు వెనుక అత్యంత పటిష్టమైన కోఆపరేటివ్ ఫెడరలిజం వ్యూహం దాగి ఉందని అనుకోవచ్చు. 2024లో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చే నాటికి ఏపీ ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలో మునిగిపోయింది. రాష్ట్ర బడ్జెట్ లోటు, అప్పుల భారం, నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణం, అటకెక్కిన పోలవరం ప్రాజెక్టును మళ్లీ గాడిలో పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వ పూర్తి స్థాయి మద్దతు, ప్రత్యక్ష ఆర్థిక నిధుల కేటాయింపు అత్యంత ఆవశ్యకం. ఈ క్రమంలో కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే రాష్ట్రానికి రావాల్సిన ప్రతి రూపాయిని రాబట్టుకోవడం చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాత్మక రాజకీయ లౌక్యం. ఈ లౌక్యానికి తగ్గ ఫలితాలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ సాయంతో పాటు కేంద్రం ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీలు, గ్రాంట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాలకు ఆమోదం తెలపడం, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం వంటి కీలక పురోగతులు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఉన్న సానుకూల సంబంధాల వల్లే సాధ్యమయ్యాయి. ప్రధాని మోదీకి, కేంద్ర కేబినెట్‌కు పదే పదే కృతజ్ఞతలు చెప్పడం ద్వారా చంద్రబాబు కేంద్ర నిధుల ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా మార్గం సుగమం చేసుకుంటున్నారు. మరోవైపు, ప్రతిపక్షాల విమర్శల నరేటివ్‌ను గమనిస్తే.. గతంలో 2018లో ధర్మపోరాటం పేరుతో మోదీపై చంద్రబాబు చేసిన ఘాటు విమర్శల వీడియోలను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ రాజకీయ ఆత్మవంచన గా అభివర్ణించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ, 2019 నుండి 2024 వరకు కేంద్రంతో విభేదించి రాష్ట్రం సాధించిందేమీ లేదని, తీవ్రంగా నష్టపోయిందని గ్రహించిన చంద్రబాబు.. గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్న రాజకీయ పరిపక్వతను ప్రదర్శిస్తున్నారు. కేంద్రంతో ఘర్షణ వైఖరి కంటే చర్చలు-లబ్ధి విధానమే ఏపీకి మేలనే స్పష్టమైన అంచనాతో ఆయన వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో ఈ సఖ్యత కేవలం నిధులకే పరిమితం కాకుండా.. విశాఖ-రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, రైల్వే జోన్ పనులు వేగవంతం కావడం, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యాసంస్థలకు కేంద్ర గ్రాంట్లు పెరగడం, కొత్త పారిశ్రామిక కారిడార్ల కేటాయింపుల్లో ఏపీ ప్రాధాన్యత పెరగడం వంటి దీర్ఘకాలిక లాభాలను తెచ్చిపెడుతోంది.

జాతీయ స్థాయిలో ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో.. ఆ రాజకీయ ప్రభావాన్ని వ్యక్తిగత ఇమేజ్‌కంటే రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణానికి ఇంధనంగా వాడుకోవడమే చంద్రబాబు బ్రాండ్ డిప్లొమసీగా అనుకోవచ్చు. విమర్శలను స్వీకరిస్తూనే, వాటిని అధిగమించి అమరావతి సమగ్ర నిర్మాణం, పోలవరం పూర్తి, పరిశ్రమల తరలింపు ద్వారా యువతకు ఉపాధి కల్పించడమే తమ ప్రాథమిక లక్ష్యమని చంద్రబాబు ప్రభుత్వం భావిస్తోంది. విమర్శకులు సెటైర్లు వేసినా, సోషల్ మీడియాలో మీమ్స్ వచ్చినా.. రాష్ట్రానికి చేకూరే నిధులు, అభివృద్ధి ప్రాజెక్టులే రేపటి రోజున తమ సమర్థతకు నిదర్శనంగా నిలుస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. వ్యక్తిగత రాజకీయ అహాన్ని పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా చంద్రబాబు నాయుడు నడుపుతున్న ఈ డిప్లొమాటిక్ పాలిటిక్స్ ఏపీ రాజకీయ చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.

# కేసుల్లో నేతలు... కిం కర్తవ్యం...

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, మాజీ మంత్రులు, కీలక నేతలు వరుసగా క్రిమినల్ కేసుల్లో ఇరుక్కుని ముందస్తు బెయిళ్ల కోసం హైకోర్టు మెట్లు ఎక్కడం లేదా అజ్ఞాతంలోకి వెళ్లడం ఇప్పుడు అత్యంత చర్చనీయాంశంగా మారింది. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం భూకబ్జా, డెత్ సర్టిఫికెట్ల ఫోర్జరీ కేసుల విచారణ నెదుర్కొనడం, గుంటూరు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కిడ్నాప్ వివాదంలో చిక్కుకోవడం, మహిళా ఎస్ఐపై దౌర్జన్యం ఆరోపణలతో ఆముదాలవలస ఇన్‌ఛార్జ్ చింతాడ రవికుమార్ అజ్ఞాతంలోకి వెళ్లడం వంటి వరుస ఘటనలు విపక్షాన్ని తీవ్ర ఆత్మరక్షణలో పడేశాయి. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. ఆర్కే రోజా, కైలే అనిల్ కుమార్, విశ్వేశ్వర్ రెడ్డి వంటి కీలక నాయకులు సైతం రకరకాల క్రిమినల్ కేసులు, అరెస్టు భయంతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతోందని, వైఎస్సార్‌సీపీ నేతలను భయాందోళనకు గురిచేసేందుకే పోలీసులు, యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అబద్ధపు కేసులు బనాయిస్తున్నారని పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. అయితే, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న కేసులు ఎక్కువగా రాజకీయాలకు సంబంధం లేనివి. భూక్రమబద్ధీకరణ పత్రాల ఫోర్జరీ, బ్రతికి ఉన్న వ్యక్తిని చనిపోయినట్లు చూపించడం , సివిల్ తగాదాల్లో అపహరణలు , ఆన్-డ్యూటీ మహిళా పోలీసులపై భౌతిక దౌర్జన్యాలు వంటి తీవ్రమైన నాన్-బెయిలబుల్ క్రిమినల్ కేసులు .గత ఐదేళ్ల పాలనలో నియోజకవర్గాల్లో తిరుగులేని ఆధిపత్యం చెలాయించిన నాయకులు, ప్రభుత్వం మారిన తర్వాత కూడా తమ పాత ధోరణినే కొనసాగించడం. స్థానిక అధికార యంత్రాంగంపై భౌతిక దాడికి దిగడం లేదా చట్టవ్యతిరేక భూ లావాదేవీలలో భాగస్వాములు కావడం ద్వారా స్వయంగా కూటమి ప్రభుత్వానికి లీగల్ ఆధారాలను అందించి ఉచ్చులో చిక్కుకుంటున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అదే సమయంలో సానుభూతి కోసం వైఎస్సార్‌సీపీ ఎంచుకున్న వ్యూహాత్మక రాజకీయ బాధితులుగా నిలిచే స్ట్రాటజీ కూడా కావొచ్చని భావిస్తున్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నామని, ప్రభుత్వం కావాలనే కేసులు పెడుతోందని ప్రజల్లో చూపించుకోవడం ద్వారా రాజకీయంగా మైలేజ్ పొందే ప్రయత్నం జరుగుతోందనే అభిప్రాయం ఉంది. అయితే, సివిల్ వివాదాలు, వ్యక్తిగత క్రిమినల్ ఆరోపణలు ఉన్న కేసుల్లో ఈ పొలిటికల్ విక్టిమ్ కార్డ్ సరిగ్గా పనిచేయదన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. సామాన్య ప్రజలు భూకబ్జాలు, కిడ్నాప్ కేసులను పొలిటికల్ వెండెట్టాగా చూడటానికి సిద్ధంగా లేకపోవడమే వైఎస్సార్‌సీపీ నరేటివ్‌కు అతిపెద్ద అడ్డంకిగా మారిందని అంటున్నారు. ఈ వరుస అరెస్టులు, ముందస్తు బెయిళ్ల కొట్టివేత పరిణామాలు వైఎస్సార్‌సీపీ కేడర్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో నడిపించే ప్రధాన నాయకులే రోజులు, వారాల తరబడి అజ్ఞాతంలోకి వెళ్లడం లేదా కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండటంతో స్థానిక శ్రేణుల్లో నాయకత్వ శూన్యత ఏర్పడుతోంది. ద్వితీయ శ్రేణి నాయకులు కనీసం నిరసన ప్రదర్శనలు చేసేందుకు కూడా వెనకడుగు వేసేలా ఈ చట్టపరమైన చర్యలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ తన డిఫెన్సివ్ మైండ్‌సెట్ నుండి బయటపడటం అత్యంత క్లిష్టంగా మారనుంది. చట్టబద్ధమైన నేరాలకు, రాజకీయ కక్షసాధింపు చర్యలకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ లీగల్, మీడియా విభాగాలు విఫలమవుతున్నాయని స్పష్టమవుతోంది. సరైన క్రిమినల్ రక్షణ ప్రణాళికలు లేకుండా, అధిష్ఠానం ఇచ్చే రాజకీయ హామీలను మాత్రమే నమ్ముకుని క్షేత్రస్థాయిలో దూకుడు ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జ్‌లు చివరకు న్యాయపరమైన సంక్షోభంలో మునిగిపోతున్నారన్న అభిప్రాయం ఎక్కువగా ఆ పార్టీలో వినిపిస్తోంది.

# దక్షిణ కోస్తా అభివృద్ధికి కొత్త అక్షమా?

గుంటూరు : దక్షిణ కోస్తా అభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు నీటి వనరులు, వ్యవసాయం, పోర్టులు, పారిశ్రామిక అవకాశాల గురించి ఎంత చెప్పినా, గత దశాబ్దంలో ఈ ప్రాంత భవిష్యత్తుపై అత్యధిక చర్చకు దారితీసిన అంశం మాత్రం అమరావతి. అయితే అమరావతి గురించి జరిగిన చర్చల్లో చాలా వరకు రాజకీయ వాదోపవాదాలే ప్రధానంగా నిలిచాయి. అభివృద్ధి కోణంలో దాని పాత్ర ఏమిటి? ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం ఎంత? అనే ప్రశ్నలు మాత్రం చర్చకు రాకుండా ఇప్పటికీ ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. రాజధాని అంటే కేవలం శాసనసభ, సచివాలయం, ప్రభుత్వ కార్యాలయాల సముదాయం కాదు. పరిపాలన, విధాన రూపకల్పన, పెట్టుబడులు, విద్య, వైద్యం, సేవారంగం, సాంకేతిక రంగాలు పరస్పరం అనుసంధానమయ్యే కేంద్రం. ప్రపంచంలోని అనేక ప్రణాళికాబద్ధ నగరాల అనుభవం కూడా ఇదే విషయాన్ని చెబుతోంది. ఒక సమర్థవంతమైన రాజధాని తన సరిహద్దులకే అభివృద్ధిని పరిమితం చేయకుండా, చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక కార్యకలాపాలకు కూడా కొత్త ఊపును అందించగలగాలి. ఆ కోణంలో చూస్తే, అమరావతి విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కొలవడం సరైన ప్రమాణం కాదు. ప్రభుత్వ సంస్థలు ఎంత స్థిరంగా పనిచేస్తున్నాయి? ప్రైవేట్ పెట్టుబడులను ఎంతవరకు ఆకర్షించగలిగింది? సేవారంగం ఎంత విస్తరించింది? విద్యా, వైద్య సంస్థలు ఎంత వేగంగా అభివృద్ధి చెందాయి? నైపుణ్యాధారిత ఉద్యోగాలకు ఎంత మేర అవకాశాలు సృష్టించబడ్డాయి?... ఈ ప్రశ్నలే అమరావతి అభివృద్ధి విలువను నిర్ణయిస్తాయి. ఒక రాజధాని నగరం నిర్మాణం అంటే ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోటుకి తరలించడం మాత్రమే కాదు. ఒకచోట కేంద్రీకృతం చేయడమే కాదు. పరిపాలనా వ్యవస్థ స్థిరపడిన చోట నిర్ణయాల వేగం పెరుగుతుంది. ప్రభుత్వ శాఖలు, నియంత్రణ సంస్థలు, న్యాయవ్యవస్థ, ప్రజా సేవలకు సంబంధించిన అనేక సంస్థలు ఒకదానితో మరొకటి సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది. దాని ప్రభావం క్రమంగా ప్రభుత్వ వ్యవస్థను దాటి ప్రైవేట్ పెట్టుబడులు, సేవారంగం, ఉపాధి అవకాశాల వరకు విస్తరిస్తుంది. అందుకే ఒక రాజధాని నగర విజయాన్ని నిర్మించిన భవనాల సంఖ్యతో కాదు; అక్కడ ఏర్పడిన సంస్థల బలంతో కొలవాలి. దక్షిణ కోస్తా అభివృద్ధి కథలో అమరావతి ఒక ప్రత్యేక అధ్యాయం. దీనిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల సమాహారంగా చూస్తే దాని పూర్తి విలువ అర్థం కాదు. ఒక రాజధాని నగరం పరిపాలనకు కేంద్రంగా మారవచ్చు. కానీ విద్య, వైద్యం, పరిశోధన, సాంకేతికత, సేవారంగం కలిసినప్పుడే అది ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను కొత్త దిశగా నడిపిస్తుంది. సుమారు 217 చదరపు కిలోమీటర్ల (దాదాపు 53,700 ఎకరాల) రాజధాని నగర ప్రాంతం దీర్ఘకాలిక దృష్టితో రూపొందించబడింది. పరిపాలనతో పాటు నివాసం, విద్య, ఆరోగ్యం, వ్యాపారం, పరిశోధన, సేవారంగం పరస్పరం అనుసంధానమయ్యే నగర నమూనాను ఇది లక్ష్యంగా పెట్టుకుంది. భవిష్యత్ దృష్టిలో క్వాంటమ్ వ్యాలీ ప్రతిపాదన అమరావతిని క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డీప్ టెక్నాలజీ, ఆధునిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది. ఇక అనుసంధానం కూడా అంతే కీలకం. సుమారు 189 కిలోమీటర్ల ప్రతిపాదిత అమరావతి ఔటర్ రింగ్ రోడ్ విజయవాడ-గుంటూరు-తెనాలి పట్టణ సముదాయాన్ని విస్తృత ప్రాంతీయ ఆర్థిక వలయంగా అనుసంధానించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అదే విధంగా ప్రతిపాదిత విజయవాడ-అమరావతి మెట్రో కారిడార్ (సుమారు 35?38 కి.మీ.) విద్య, ఉపాధి, సేవారంగాన్ని మరింత దగ్గర చేసే పట్టణ రవాణా వ్యవస్థగా రూపుదిద్దుకుంటోంది. అయితే అమరావతి విజయాన్ని భవనాల సంఖ్య నిర్ణయించదు. విద్యార్థులను ఆకర్షించే విశ్వవిద్యాలయాలు, ప్రపంచస్థాయి వైద్య సేవలు, పరిశోధన సంస్థలు, స్టార్టప్ ఎకోసిస్టమ్, నాలెడ్జ్ ఎకానమీ, వాటిని కలిపే రవాణా వ్యవస్థ? ఇవన్నీ కలిసినప్పుడే అది ప్రాంతీయ అభివృద్ధి కేంద్రంగా నిలుస్తుంది. ఏ ప్రాంతమైనా శాశ్వత అభివృద్ధిని సాధించాలంటే భౌతిక మౌలిక సదుపాయాలు మాత్రమే సరిపోవు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వైద్య కళాశాలలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు సమాంతరంగా ఎదగాలి. అలాంటి వ్యవస్థ ఏర్పడినప్పుడే స్థానిక యువతకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందడంతోపాటు, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి కూడా ప్రతిభ, పెట్టుబడులు ఆకర్షితమవుతాయి. ఈ కోణంలో చూస్తే, అమరావతి చుట్టూ విద్యా, వైద్య సంస్థల అభివృద్ధి కేవలం రాజధాని అవసరమే కాదు. దక్షిణ కోస్తా మానవ వనరుల నాణ్యతను పెంచే దీర్ఘకాలిక పెట్టుబడిగా కూడా చూడాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పోటీ క్రమంగా భూమి, భవనాలు, పరిశ్రమల నుంచి జ్ఞానం, పరిశోధన, సాంకేతికత వైపు మారుతోంది. ఈ నేపథ్యంలో అమరావతిని కేవలం పరిపాలనా కేంద్రంగా కాకుండా నాలెడ్జ్ ఎకానమీకి వేదికగా తీర్చిదిద్దాలనే ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, సెమీకండక్టర్ పరిశోధన, డీప్-టెక్ స్టార్టప్‌లు, డిజిటల్ సేవలు వంటి రంగాల్లో దీర్ఘకాలిక సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు విజయవంతమైతే, అమరావతి దక్షిణ కోస్తా ఆర్థిక నిర్మాణానికి మరో కొత్త కోణాన్ని జోడించే అవకాశం ఉంది. అయితే ఈ ప్రయత్నాల విజయాన్ని ప్రకటనలతో కాదు; సంస్థల స్థాపన, పరిశోధన, పెట్టుబడులు, ఉపాధి సృష్టి వంటి స్పష్టమైన ఫలితాలతోనే కొలవాల్సి ఉంటుంది. ఒక్కటే. దాని అభివృద్ధి ప్రభావం గుంటూరు?కృష్ణా ప్రాంతానికే పరిమితమవుతుందా? లేక తూర్పు గోదావరి నుంచి నెల్లూరు వరకు మొత్తం దక్షిణ కోస్తాలో పెట్టుబడులు, సేవారంగం, విద్య, వైద్య రంగాల విస్తరణకు దోహదపడుతుందా? ఒక రాజధాని నిజమైన విజయాన్ని దాని పరిపాలనా సరిహద్దులు నిర్ణయించవు. దాని ప్రభావం ఎంత విస్తృత ప్రాంతానికి చేరిందన్నదే నిర్ణయిస్తుంది. అమరావతి కూడా అదే ప్రమాణంపై నిలబడాల్సి ఉంటుంది. "అయితే దక్షిణ కోస్తా అభివృద్ధి పటాన్ని మొత్తం ఒకసారి పరిశీలిస్తే, ఒక ఆసక్తికరమైన వ్యత్యాసం కనిపిస్తుంది.

# 205 మండలాల్లో దారుణ పరిస్థితులు..

ఏలూరు : ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ మొదలై రెండు నెలలు అవుతున్నా వర్షాలు మాత్రం కురవడం లేదు. కొన్ని జిల్లాల్లో తేలికపాటి వానలు మినహా పెద్దగా వర్షాలు ఎక్కడా పడలేదు. దీంతో రాష్ట్రంలోని 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.. ఇటు రాష్ట్రవ్యాప్తంగా సాగు విస్తీర్ణం కూడా దారుణంగా తగ్గిపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు కష్టాలు మొదలయ్యాయి.. ఖరీఫ్ మొదలై రెండు నెలలు గడిచినా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురవుతున్నాయి. జూన్ 1 నుంచి ఆగస్టు 3 వరకు చూస్తే రాష్ట్రంలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే 50.80శాతం తక్కువ వానలు పడ్డాయి. అలాగే రాష్ట్రంలో పంటలు కూడా సాధారణ విస్తీర్ణంలో 43% మాత్రమే సాగయ్యాయి. ఇప్పటికే రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది.. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు నమోదైందంటే పరిస్థితి ఎలా అర్థం చేసుకోవచ్చు. వచ్చే మూడు నెలల్లోనూ రాష్ట్రంలో తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనా వేస్తుండటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. గత మూడు, నాలుగు రోజులుగా రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు మాత్రమే పడుతున్నాయి. కొన్ని జిల్లాల్లో 6 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదైనా సరే పరిస్థితి ఏమాత్రం మారలేదు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో లోటు వర్షపాతమే నమోదైంది. రాష్ట్రంలోనే అత్యధికంగా అన్నమయ్య జిల్లాలో 73.50శాతం లోటు వర్షపాతం నమోదైంది. విశాఖపట్నం జిల్లాలో సాధారణం కంటే 66.80శాతం, చిత్తూరు జిల్లాలో 63.50శాతం, ప్రకాశం జిల్లాలో 59.70శాతం, కడప జిల్లాలో 59.20శాతం, పశ్చిమగోదావరి జిల్లాలో 57.60శాతం, శ్రీకాకుళం జిల్లాలో 57.20శాతం, తూర్పుగోదావరి జిల్లాలో 53.60శాతం, పార్వతీపురం మన్యం జిల్లాలో 50.90శాతం, మార్కాపురం జిల్లాలో 50.20శాతం తక్కువ వర్షాలు పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 397 మండలాల్లో లోటు వర్షపాతం.. 205 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 77 లక్షల ఎకరాలు ఉంటే.. ఇప్పటి వరకు 33.29 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. వరి నాట్లు 38 ఎకరాల్లో వేయాల్సి ఉంటే.. కేవలం 15 లక్షల ఎకరాలకు పరిమితం అయ్యింది. కంది 7.50 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. 3.60 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. వేరుశనగ 9.67 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా.. అది కేవలం 2.27 లక్షల ఎకరాలకే పరిమితమైంది. అంతేకాదు చిత్తూరు జిల్లా, అన్నమయ్య జిల్లాల్లో 88శాతం.. అనంతపురం జిల్లాలో 87శాతం, నంద్యాల జిల్లాలో 56శాతం సాగు విస్తీర్ణం తగ్గింది

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా...

నెల్లూరు : ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు. దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజయసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట.

యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట. ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.

# 1053 కిలోమీటర్ల గ్రేట్ వాల్ ఆఫ్ ఆంధ్ర

నెల్లూరు : వాతావరణ మార్పుల నేపథ్యంలో తీర ప్రాంత జిల్లాలకు ఈ ఏడాది విపత్తుల ముంపు పొంచి ఉందని.. దానిని ఎదుర్కొనేందుకే గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టును కేంద్రం ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోందని డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేయాలని.. అదే గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అని పవన్ కళ్యాణ్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ కోసం తీవ్ర స్థాయిలో కృషి చేస్తున్నారు. రాష్ట్రంలో అడవుల విస్తరణకు, పచ్చదనాన్ని పెంపొందిం చేందుకు ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. సీడ్ బాల్స్‌తో అడవులను పెంచాలని నిర్ణయించిన పవన్ కళ్యాణ్.. ఇప్పుడు గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుతో మరోసారి ముందుకొచ్చారు. తీర ప్రాంత పర్యావరణ పరిరక్షణ, కోతల నివారణ చర్యల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. రానున్న రెండు నెలల్లో గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రేట్ గ్రీన్ వాల్ లక్ష్య సాధనలో భాగంగా గడిచిన రెండేళ్ల కాలంలో సాధించిన పురోగతికి జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మడ అడవుల విస్తరణలో దేశంలో రెండో స్థానం సాధించేందుకు కృషి చేసిన అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు. గ్రేట్ గ్రీన్ వాల్ పనుల పురోగతిపై అటవీశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది మడ అడవులు ఎంత విస్తీర్ణంలో నాటనున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా తీర ప్రాంత జిల్లాలకు అదనంగా మరో 70 లక్షల మొక్కలు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు తలెత్తాయి. ప్రస్తుతం తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తీర ప్రాంత జిల్లాలకు విపత్తుల ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితుల నుంచి మన తీరాన్ని రక్షించుకోవడానికి గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషించనుంది. రాష్ట్రంలో విస్తరించిన 1053 కిలోమీటర్ల తీర ప్రాంతం వెట 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో కూడిన గోడను ఏర్పాటు చేస్తున్నాం. అందులో ఈ ఏడాది 8888 హెక్టార్లలో గ్రీన్ వాల్ విస్తరణకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీటి సేకరణ, నాటే ప్రక్రియను పూర్తి చేయాలి. దాదాపు 5,000 హెక్టార్లలో తాటి వనాల ఏర్పాటును ఈ ఏడాది లక్ష్యంగా పెట్టుకున్నాం. కాలువ గట్లు, చెరువులు, తీర ప్రాంతాల్లో తాటి చెట్లు గాలి నిరోధక వ్యవస్థగా నిలుస్తాయి. తాటివనాలు, సామాజికవనాల ఏర్పాటు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి" అని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# బోరుగడ్డ అనిల్ మెరుపు దీక్ష

గుంటూరు : తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నివాసం ముందు వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కుమార్ సంచలన ఆందోళనకు దిగారు. తనను పార్టీ కార్యాలయం లోపలకు అనుమతించడం లేదని నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై తీవ్ర వ్యాఖ్యలతో అందరికీ షాక్ ఇచ్చారు. తాను వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అభిమాని అని, ఆయన కోసం పనిచేసిన తనకు పార్టీలో కనీస గౌరవం లేకుండా చేస్తున్నారని బోరుగడ్డ ఫైర్ అయ్యారు. జగన్ కోసం పనిచేసిన తనపై 22 కేసులు నమోదు చేశారని, తన కంపెనీలు మూసివేతకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన భార్యతో కలిసి జగన్ నివాసం వద్ద బోరుగడ్డ బైఠాయించడంతో కలకలం చెలరేగింది. వైసీపీ అధినేత జగన్ రెడ్డి నివాసం, పార్టీ కేంద్ర కార్యాలయం ముందు అనూహ్యంగా బోరుగడ్డ అనిల్ కుమార్ భార్యతో కలిసి బైఠాయించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ అభిమానిగా ఎన్నో త్యాగాలు చేసిన తాను అధినేతను కలుస్తానంటే పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సజ్జల కోటరీతో తనను రౌడీషీటర్ అంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై రౌడీషీట్ లేదని హైకోర్టు చెప్పినా, వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్ రెడ్డి మాత్రం బోరుగడ్డ రౌడీషీటర్ అంటూ మాట్లాడుతున్నారని, ఆయనకు నోటీసులు పంపానని వెల్లడించారు. ఈ సమయంలో గతంలో తాను కారుమూరు వెంకటరెడ్డితో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను మీడియాకు వినిపించారు తాను పార్టీ కోసం కష్టపడ్డానని, 9 నెలలు జైలులో ఉన్నానని అయినా తనను పార్టీ ఆఫీసులోకి రానీయడం లేదన్నారు. దళితులు మా మేనమామలు అని చెప్పే జగన్ రెడ్డి ఈ విషయంలో కల్పించుకోవాలని డిమాండ్ చేశారు. తనపై సజ్జల రామకృష్ణారెడ్డి కుట్ర పన్నుతున్నారని, ఈ విషయాలు ఏవీ ఆయనకు తెలియవని ఆరోపించారు. తమకు జగన్ రెడ్డి మాత్రమే నాయకుడు అని, సజ్జల నాయకుడు కాదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ బట్టలు వేసుకుని పార్టీ కార్యాలయంలో కూర్చునే సజ్జలకు ఇక్కడ పనేమీ లేదన్నారు. తమలాంటి వారు పార్టీ కోసం కష్టపడుతున్నామని, కేసులు పెట్టించుకుని రోడ్డు మీదపడ్డామని వాపోయారు. జగన్ సతీమణి భారతి, తల్లి విజయమ్మను అవమానించారనే తాను బయటకు వచ్చానని, అయినా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ ఆఫీసుకు రమ్మని నాలుగు గంటలు కూర్చోబెట్టారని అయినా జగన్ రెడ్డిని కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by **B.PRAMOD KUMAR**, B-258, Phase-1, Vanasthalipuram, Hyderabad-70. Printed at **Garuda Printers**, H.No :2-86/1, Plot No. 23 -SP, Sy.No.417, Sagar High Way. Ragannaguda Village, Abdullapurmet (M), Rangareddy Dist, Telangana State- 501510 , **Published at :** H.No.Plot no.1, Bhagya laxmi Towers, opp: GHMC, L.B.Nagar Circle, venkateswara Colony, Saroornagar, Ranga Reddy Dist. Hyderabad-500035,Telangana State, **Editor :B. Pramod Kumar**, **RNI No: TELTEL/2021/81803**